

కాకినాడ జిల్లాకు చేరుకున్న 750 మెట్రిక్ టన్నుల యూరియా

నేడు టోకెన్ల ద్వారా రైతులకు పంపిణీ

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాకు శుక్రవారం 750 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించారు. దీన్ని ద్వారపూడి నుంచి జిల్లావ్యాప్తంగా ఉన్న 31 మార్క్‌ఫెడ్ సెంటర్లు, 31 ప్రైవేటు డీలర్లు, మన గ్రోమోర్ సెంటర్లకు వివిధ వాహనాల ద్వారా తరలించారు. శనివారం టోకెన్ల విధానంలో రైతులకు ఎరువులు పంపిణీ చేయనున్నారు. కాకినాడ జిల్లాలో రైతులకు ఎరువుల కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్ తెలిపారు. జిల్లాలో ఎరువుల నిల్వల పరిస్థితిని ఎప్పటికప్పుడు రాష్ట్ర ఉన్నతాధికారులకు వివరించి కావాల్సిన మొత్తంలో ఎరువులను తీసుకొస్తున్నామని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.

జిల్లాలో విజిలెన్స్ దాడులు

కాకినాడ జిల్లాలో ఎరువుల దుకాణాలపై వ్యవసాయశాఖ, విజిలెన్స్ బృందాల దాడులు కొనసాగుతున్నాయి. శుక్రవారం గండేపల్లి మండలంలో విజిలెన్స్ దాడులు జరిగాయి. రెండు ఎరువుల దుకాణాల్లో ఎరువుల విక్రయాలను నిలుపుదల చేశారు. ప్రత్తిపాడు మండలంలో వ్యవసాయశాఖ అధికారులు తనిఖీలు చేసినట్టు సమాచారం. శనివారం కూడా దాడులు సాగుతాయని సంబంధిత అధికారులు వెల్లడించారు.

ఖరీఫ్‌లో ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తాం!

- రైతులకు సరిపడే గోనె సంచులు ఏర్పాటు
- రవాణా ఇబ్బందులు లేకుండా కార్యాచరణ
- ఐదు జిల్లాల్లో 19.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం
- జిల్లాల వారీగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్
- సమీక్షలు నిర్వహించిన మంత్రి నాదెండ్ల

6



కాకినాడ కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన ఖరీఫ్ సీజన్ సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్. చిత్రంలో ఏపీ పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, ఎండీ మంజీర్ జిలాని సామూన్, వివిధ జిల్లాల జాయింట్ కలెక్టర్లు

ప్రసాద్ స్కీం పనులు పూర్తి చేస్తాం

- టూరిజం శాఖ చీఫ్ ఇంజనీరు వెంకటేశ్వరరావు
- అన్నవరంలో అన్నదాన భవన నిర్మాణ పనుల పరిశీలన

7

రైస్ మిల్లర్ల బకాయిలు రూ.వెయ్యి కోట్లు చెల్లించండి

- ఉమ్మడి జిల్లాల సమీక్షలో మంత్రిని కోరిన మిల్లర్లు
- పీఏసీఎస్ బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి
- పీఏసీఎస్‌లు ఆర్థిక పరిపుష్టికి సహకారం ఇవ్వాలి

6



ఉప్పెనలా..

అల్లకల్లోలం: ఇది ఉప్పాడ బీచ్ రోడ్డు..13 కిలోమీటర్లు.. ఇక్కడ గత 22 ఏళ్లుగా 1360 ఎకరాల భూమి సముద్రంలో కలిసిపోయింది.. రెండు ఆలయాలు కనుమరుగైపోయాయి.. 150పైనే నివాసాలు కడలి గర్భంలో కలిసిపోయాయి. అయినా ఇంకా ఉప్పెనలా ఎగసిపడుతూనే ఉంది.. ఊళ్లపైకి ముంచుకొస్తూనే ఉంది.. గురువారం అలలు ఉప్పాడ రోడ్డును ఇలా ఛిద్రం చేసేశాయి..

ముంచుకొస్తున్న కడలి

కాకినాడలో ఉప్పాడ వద్ద తీరాన్ని సముద్రం ఊచకోత కోస్తోంది. రాకాసి అలలతో ముంచేస్తూ అంతకంతకూ ముందుకు వచ్చేస్తూ హడలెత్తిస్తోంది. ఏ తీరంలోను లేనంతగా భయపెడుతూ వేల ఎకరాల భూములు, ఇళ్లను కలిపేసుకుంటోంది. గడచిన కొన్నేళ్లలో 1,360 ఎకరాలు కడలిలో కలిసిపోయాయంటే కోత తీవ్రత ఎలా ఉందో ఊహించుకోవచ్చు. గతంలో నిర్మించిన జియోట్యూబ్ ధ్వంసం, ఉప్పాడ సమీపంలో హార్బర్ నిర్మాణ పనుల ప్రభావం సైతం ప్రస్తుతం కోత పెరగడానికి కారణమవుతోంది. గత జగన్ సర్కారు కోత నివారణకు రూ.200 కోట్లతో తయారు చేసిన ప్రతిపాదనలను గాలికొదిలేయడమూ సమస్య తీవ్రతకు మరో కోణం.

- (కాకినాడ, ఆంధ్రజ్యోతి)

- ఉప్పాడలో సముద్రపు కోత తీవ్రం
- అలల ధాటికి బీచ్ రోడ్డు మళ్లీ ధ్వంసం
- పోటు, అల్పపీడనానికీ అల్లకల్లోలం
- నాడు జగన్ సర్కారు తీవ్ర నిర్లక్ష్యం
- ఉప్పాడలో 1,360 ఎకరాలు మాయం
- కోతపై చంద్రబాబు, పవన్ దృష్టి
- నిధులివ్వడానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్?
- కోనసీమలోనూ కన్నీటి తీరమే

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)
సముద్రపు అలల తాకిడికి తీర ప్రాంతం భారీగా కోతకు గురవుతోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని సుమారు 80 కిలోమీటర్ల పొడవున ఉన్న అంతర్వేది నుంచి యానాం వరకు ఉన్న తీరంలో తరచూ అలజడులు రేగి వందల ఎకరాల భూములు కడలిగర్భంలో కలిసిపోతున్నాయి. సముద్ర తీరం వెంబడి ఉన్న తొమ్మిది మండలాల్లోని 40కు పైగా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అంబేడ్కర్ కోనసీమలో తీరంలో కోతకు గురవుతున్న ప్రాంతాలు ఇలా..

కోనసీమలో..


ఊరిని ముంచేసింది: ఉప్పాడ ఊరిలోకి చొచ్చుకొచ్చిన సముద్రం

అంతర్వేది, కేశవదాసుపాలెం, చింతలమోరి గ్రామాల్లో సముద్ర తీరం భారీగా కోతకు గురికావడంతోపాటు కెరటాల తాకిడికి ఉప్పునీరు సమీప పంట పొలాల్లోకి చేరి పంటలను సర్వనాశనం చేస్తోంది. ఇటీవల అంతర్వేది పల్లిపాలెం తరచూ సముద్ర కెరటాల తాకిడికి ముంపునకు గురవుతోంది. పడమటిపాలెం, కేశనపల్లి, కరవాక, అల్లవరం మండలం ఓడలరేవు, కొమరగిరిపట్నం, రామేశ్వరం మొగ, వాసాలతిప్ప, ఎస్.యానాం, బ్రహ్మసమేధ్యం నుంచి యానాం వరకు ఉన్న సముద్ర తీర ప్రాంతం భారీగానే కోతకు గురవుతోంది. అల్లవరం మండలం ఓడలరేవులోని వేల కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్న ఓఎన్జీసీ ప్లాంటు వద్ద అర కిలోమీటరు మేర ముందుకు చొచ్చుకు వచ్చిన సముద్రం ప్లాంటు రక్షణ గోడను సైతం ఛిద్రం చేసి చొచ్చుకు వస్తున్నతీరు గ్రామస్తులను భయకంపితులను చేస్తోంది. ఓడలరేవు నుంచి కొమరగిరిపట్నం వరకు తీర ప్రాంత భూములన్నీ భారీగా కోతకు గురి కావడంతోపాటు ఐదారు అడుగుల మేర తీరాన్ని కోతకు గురి చేయడంతో సముద్ర స్నానాలకు వెళ్లేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. కాట్రేనికోన మండల శివారు బ్రహ్మసమేధ్యం తీరంలో సరుగుడు తోటలు సైతం కోతకు గురై కుప్పకూలుతున్నాయి. తుఫాను, అల్పపీడనాల సమయంలో సముద్రం అల్లకల్లోలంగా మారుతోంది. ఆ సమయంలో మీటరు నుంచి రెండు మీటర్ల మేర అలలు ఉవ్వెత్తున ఎగసిపడి తీరాన్ని కబళిస్తున్నాయి.


అల్లవరం మండలం ఓడలరేవులో ఓఎన్జీసీ ప్లాంటు వద్ద కోత (ఫైల్)

సముద్రంలో 1360 ఎకరాలు

ఉప్పాడ బీచ్ అంటే గుర్తుకొచ్చేది అందమైన నీలిసముద్రం.. అంతకుమించి గడచిన 22 ఏళ్లుగా సముద్రపు కోత అంతకంతకూ ముందుకొస్తూ కలవరపెడుతోంది. ఇప్పటివరకు సముద్ర గర్భంలో కరిగిపోయిన భూమి 1,360 ఎకరాలైతే కనుమరుగైపోయిన ఆలయాలు రెండు, నివాసాలు 150పైనే. ఉప్పాడ, సూరాడపేట, కోనపాపేటవద్ద అయితే మత్స్యకారుల ఇళ్లల్లోకి సముద్రం వచ్చేస్తోంది. ఉప్పాడకు సమీపంలో పోర్టులకు వచ్చే నౌకల కోసం బ్రేక్‌వాటర్స్ నిర్మించి అలల ఒత్తిడి తగ్గించారు. తీరా ఆ ఒత్తిడి ఉప్పాడకు మళ్లీ శాపంగా మారింది. ఇటీవల ఉప్పాడకు సమీపంలో ఫిషింగ్ హార్బర్ పనులు ఊపందుకున్నాయి. జెట్టీల కోసం భారీ బండరాళ్లతో సముద్రంలో గోడ నిర్మిస్తున్నారు. దీని ప్రభావం పక్కనే ఉన్న ఉప్పాడ కోతను మరింత పెంచుతోంది. కాకినాడ నుంచి ఉప్పాడకు వెళ్లాలంటే బీచ్ రోడ్డే గతి. పరిశ్రమలు, సెజ్, వందలాది హేచరీలకు ఈ రోడ్డే దిక్కు. కాకినాడ వాకలపూడి నుంచి ఉప్పాడ వరకు 13 కిలోమీటర్ల వరకు బీచ్ రోడ్డు ఉండగా, సముద్రపు కోత 9 కిలోమీటర్ల పరిధిలో అధికంగా ఉంది. బీచ్ రోడ్డుకు మరమ్మతులు చేయించకపోతే అనేక గ్రామాల ప్రజలకు ఇబ్బందే.

కోత ఆపేయొచ్చు.. ఇలా..

పిఠాపురం నియోజకవర్గంలోని ఉప్పాడ కోతపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కోత నివారణకు పరిష్కారం చూపాలని నిర్ణయించారు. నేషనల్ కోస్టల్ రీసెర్చ్ సెంటర్ (ఎన్‌సీఆర్‌సీ) శాస్త్రవేత్తలతో బీచ్ కోతపై అధ్యయనం చేయించారు. వేవ్ కరెంట్, సముద్రం అడుగున పరిణామాలు కారణమని తేల్చారు. అలల తీవ్రత తగ్గించేందుకు సముద్రం అడుగు నుంచి కాంక్రీట్‌గోడ నిర్మించాలని ప్రతిపాదించారు. ఉప్పాడకు దక్షిణం వైపు కాకినాడ నుంచి వచ్చే దారిలో మలుపు వద్ద సముద్రం పూర్తిగా ముందుకురావడంతో కొత్త బీచ్ సృష్టించాలని తేల్చారు. సీఎం ఆదేశాల మేరకు కోత నివారణ ప్రణాళిక నిధులకు కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ కేంద్రంతో సంప్రదింపులు జరపగా రూ.323 కోట్లు ఇవ్వడానికి కేంద్రం పచ్చజెండా ఊపింది.



మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

రైతులు పండించిన ధాన్యం పూర్తిగా కొనుగోలు చేయాలి

మంత్రికి ఏపీ రైతు సంఘం వినతి

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు సమయంలో రైతులు, కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పండించిన పంటలను పూర్తిగా కొనుగోలు చేయాలని రైతు సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు కాకినాడ కలెక్టరేట్లో మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, కౌలు రైతు సంఘం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి రామాంజనేయులు వినతి పత్రం ఇచ్చారు. పండించిన ధాన్యాన్ని పూర్తిగా కొనాలని, సామూహిక కల్లాలు లేక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నందున వాటిని ఏర్పాటుచేయాలని, టార్పాలిన్లు సబ్సిడీపై ఇవ్వాలని, కేంద్రం గిట్టుబాటు ధరకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించాలని కోరారు.

కమీషన్ పెంచండి!

- నిత్యావసర వస్తువులు అమ్ముకునే విధంగా చర్యలు
- మంత్రి నాదెండ్లకు రేషన్ డీలర్ల సంఘం డిమాండ్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తమకు ఇచ్చే కమీషన్ పెంచాలని, అలాగే రేషన్ దుకాణాల్లో నిత్యావసర వస్తువులు అమ్ముకునే వీలుగా ఉత్తర్వులు ఇవ్వాలని జిల్లా రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు నల్లా వెంకటేశ్వరరావు కోరారు. ఈమేరకు కాకినాడ జీఆర్‌టీ హోటల్‌లో మంత్రి నాదెండ్ల మనోహర్‌కు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. అతి తక్కువ కమీషన్ వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీలో సచివాలయం సిబ్బంది సహకరించడంలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎంఎల్ఎస్ పాయింట్‌లలో తూకంలో తరుగు వస్తోందని మంత్రికి వివరించారు. సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు వరద దొరబాబు, కే.కృష్ణ, తూము గాంధీలు పాల్గొన్నారు.

ఉప్పాడ తీరంలో కలెక్టర్ పర్యటన

- అలల ఉధృతిని పరిశీలిస్తూ కెరటాలకు తడిసిన కలెక్టర్
- తక్షణ సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశాలు


ఉప్పాడ సమీపంలో కొత్తపట్నం వద్ద కోతకు గురైన బీచ్ రోడ్డును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కొత్తపల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం ఉప్పాడలో సముద్ర కెరటాల ధాటికి గురవుతున్న తీరప్రాంతాన్ని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి శుక్రవారం పరిశీలించారు. ఆయన వెంట రెవెన్యూ, పంచాయతీరాజ్, మత్స్యశాఖ, ఆర్‌అండ్‌బీ అధికారులు ఉన్నారు. ఉప్పాడ తీరం అల్లకల్లోలం, కొత్తపట్నం వద్ద కోతకు గురైన బీచ్ రోడ్డు, సముద్రం నీటితో మునిగిన పాఠశాలను కలెక్టర్ పరిశీలించారు. సుబ్బంపేట నుంచి కొత్తపట్నం నడిచివెళ్లేటప్పుడు కలెక్టర్‌పై కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. దీంతో కలెక్టర్‌తోపాటు అధికారులంతా తడిసిపోయారు. అనంతరం కొత్తపట్నం మత్స్యకారులు నివాసం ఉండే ప్రాంతాల నుంచి నీరు బైటకు పోయేందుకు తక్షణ పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఉధృతంగా ఎగసిపడే సముద్రకెరటాల ధాటికి మత్స్యకారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ మత్స్యకార మహిళలకు ధైర్యం చెప్పారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేతృత్వంలో తీరప్రాంతాన్ని సముద్రకోత నుంచి శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారని వివరించారు. కాగా సముద్ర కెరటాలు జనావాసాల్లోకి చేరి ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు 20 కిలోల బియ్యం పంపిణీ చేయాలని కలెక్టర్ తహసీల్దార్‌కి ఆదేశాలిచ్చారు.


ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డులో రాకపోకలకు బంద్

కొత్తపల్లి, సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉప్పాడ బీచ్ రోడ్డులో కొత్తపట్నం వద్ద సముద్ర కెరటాల ధాటికి రోడ్డు ధ్వంసమైన దృష్ట్యా ఉప్పాడ-కాకినాడ రోడ్డులో వాహనాల రాకపోకలను నియంత్రించామని కొత్తపల్లి ఎస్ఐ జి వెంకటేష్ తెలిపారు. ఉప్పాడ నుంచి కాకినాడ వెళ్లే వాహనాలను పిఠాపురం మీదుగా దారి మళ్లించామని చెప్పారు. ఇక కాకినాడ నుంచి ఉప్పాడ వచ్చే వాహనాలను నేమాం ఎస్ఆర్ఎంటీ చౌదరి గెస్ట్‌హౌస్ నుంచి పండూరు మీదుగా మళ్లిస్తున్నట్టు తిమ్మాపురం ఎస్ఐ వై గణేష్‌కుమార్ తెలిపారు.

‘డల్’ జీవన్ మిషన్..

గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ప్రారంభించిన జలజీవన్ మిషన్ పథకం పనుల లక్ష్యం నెరవేరడం లేదు. ప్రతి గ్రామీణ కుటుంబానికి ఇంటింటికీ కుళాయిల ద్వారా సురక్షిత నీటిని అందిస్తామని అప్పట్లో ప్రజా ప్రతినిధుల హామీలిచ్చినా చుక్క నీరు కూడా ఏ ఇంటికీ చేరలేదు. 2020లో ప్రారంభమైన ఈ పనులు ప్రస్తుతం నత్తనడకన సాగుతున్నాయి. ఇటీవలే కాంట్రాక్టర్లు తమకు బిల్లులు చెల్లించడం లేదని పనులు నిలిపివేశారు. నిజానికి ఈ పనులు 2028 నాటికి పూర్తి కావల్సి ఉంది.

- ఇదీ వైసీపీ ప్రభుత్వ నిర్వాకం
- నాలుగేళ్లుగా చుక్కనీరు అందించని పథకం
- కేంద్రం ఇచ్చిన నిధులను దారి మళ్లించిన వైసీపీ సర్కారు
- కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో జాప్యం
- జిల్లాలో 1007 పనులు మంజూరు.. 567 పూర్తి
- పనుల పూర్తిపై దృష్టిసారించిన కూటమి ప్రభుత్వం



(కాకినాడ - ఆంధ్రజ్యోతి)
జిల్లాలోని 21 మండలాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ జలజీవన్ పనులు చేపట్టారు. సుమారు 385 గ్రామాలు, 687 హేబిటేషన్లకు ఇంటింటికీ కుళాయిలు వేసే పనులు నిర్వహించారు. కొత్త పైపులైన్ల ఏర్పాటు, తాగునీటి ట్యాంకుల నిర్మాణం చేపట్టారు. జిల్లాలో మొత్తం 1007 పనులు మంజూరు చేసి..రూ.498.59 కోట్లను కేటాయించారు. వీటితో జిల్లావ్యాప్తంగా ఈ పథకంలో ఎంపిక చేసిన అన్నిచోట్ల దాదాపు పనులు కాంట్రాక్టర్లు చేపడుతూనే ఉన్నారు. సుమారు 567 పనులు ఇప్పటికి పూర్తయ్యాయి. వాటికి సంబంధించిన రూ.198.65 కోట్ల పనులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం ఆయా కాంట్రాక్టర్లకు చెల్లించింది. ఇంకా జిల్లాలో 440 పనులు జరుగుతూ ఉన్నాయి. రూ.50.86 కోట్ల మేర కాంట్రాక్టర్లకు బిల్లులు బకాయిలు చెల్లించాల్సి ఉంది. గత ఏడెనిమిది నెలలుగా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో ప్రస్తుతం పలుచోట్ల పనులు నిలిచిపోయాయి.

అంతంతమాత్రంగానే...

గత వైసీపీ ప్రభుత్వం ఈ పనులపై పూర్తి నిర్లక్ష్యం వహించింది. పనులను వేగవంతంగా పూర్తి చేయించడంలో అశ్రద్ధ కనబరిచింది. రాష్ట్ర వాటా నిధులు సరిగా ఇవ్వకపోవడంతోపాటు కేంద్రం ఇచ్చిన నిధులను ఇతర అవసరాలకు వాడేసుకుంది. దీంతో ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు. ఇచ్చిన కొద్దిపాటి కుళాయిల ద్వారా నీరు సరిగా సరఫరా చేయిలేకపోయింది. జలజీవన్ మిషన్ ప్రాధాన్యాన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. వేసవిలో సైతం నీరందించేలా సమీప జలాశయాలు, నదులకు పథకాన్ని అనుసంధానించాలని నిర్ణయించింది. రాష్ట్రప్రభుత్వం ఈ పథకంలో ప్రతిపాదించిన పనులన్నీ పూర్తి చేస్తే 2028 నాటికి గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపొచ్చు.

పనులు ఆపేసిన కాంట్రాక్టర్లు

తమకు రావల్సిన బిల్లులు వెంటనే చెల్లించాలంటూ ఎంఎస్ఎంఈ కాంట్రాక్టర్లు ఇటీవల నిరసన చేపట్టి పనులు నిలిపివేశారు. ఇటీవలే నవ్యాంధ్ర ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ పేరుతో కాకినాడలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాంట్రాకర్లు సమావేశమయ్యారు. వారి భవిష్యత్తు కార్యచరణపై చర్చించుకున్నారు. ప్రభుత్వం ఏడాదికాలంగా తమకు బిల్లులు సరిగా చెల్లించడం లేదని, బడా కంపెనీలకు మాత్రమే పెద్ద మొత్తంలో చెల్లిస్తున్నారని, ఇలా అయితే తాము ఎలా పనులు చేపట్టగలమని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు వెయ్యి మంది ఎంఎస్ఎంఈ కాంట్రాక్టర్లతోపాటు పరోక్షంగా 50వేల కుటుంబాలు ఈ పెండింగ్ బిల్లుల సొమ్ముల కోసం ఎదురుచూస్తున్నాయన్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ ఇంజినీర్ సీహెచ్ఎన్‌వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో పలుచోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లులు చెల్లిస్తేనే పనులు మొదలు పెడతామంటూ కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు.



కేజ్ కల్చర్‌కు ఏలేరు ప్రాజెక్టు

ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

ఏలేశ్వరం జలాశయంలోకి చేప పిల్లల విడుదల

7

బస్సులో 600 గ్రా. బంగారు వస్తువుల మాయం

గండేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితుడు

7



విద్యార్థిని రూపొందించిన ప్రాజెక్టు

శాస్త్రవేత్తల కృషి ఫలితంగా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నిరంతర పురోగతి సాధిస్తున్నాం. అంతే వేగంగా సమాజంలో పలు విభాగాల్లో కొత్తకొత్త సమస్యలు పుట్టుకొస్తున్నాయి. ఎప్పటికప్పుడు రూపం మార్చుకుంటున్న సమస్యలకు పరిష్కార మార్గాలు కనుగొనాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అటువంటి పరిస్థితుల్లో భవిష్యత్తు పరిణామాలను సైతం ముందుగానే ఊహించి వాటికి పరిష్కార మార్గాలు కనుగొనే అవకాశం పాఠశాల స్థాయి విద్యార్థులకు లభించింది.



పాఠశాల విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులు

స్ఫూర్తిని నింపే ఆలోచనలకు ఆహ్వానం

- సమస్యలకు శాస్త్రీయ పరిష్కారం చూపించాలి
- ఇన్‌స్పైర్ నామినేషన్లకు ఈ నెల 15 వరకు అవకాశం

(అమలాపురం రూరల్-ఆంధ్రజ్యోతి)

విద్యార్థుల సృజనాత్మక ఆలోచనలను ప్రపంచం ముందు ఆవిష్కరించి వారిని భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ఆధ్వర్యంలో ఇన్‌స్పైర్ (ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్డ్ రీసెర్చ్) మనక్ (మిలియన్ మైండ్స్ ఆగ్మెంటింగ్ నేషనల్ ఆస్పిరేషన్ అండ్ నాలెడ్జ్) కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రతిపాఠశాల నుంచి ప్రాజెక్టులను ఎంపిక చేసి వాటిలో ఉత్తమ ప్రాజెక్టులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. ఆ గురుతర బాధ్యతను జిల్లా విద్యా శాఖకు అప్పగించారు. ఆధునిక సమాజంలో స్ఫూర్తిని నింపి ప్రేరణ కలిగించే విధంగా సైన్స్‌లోని పలు అంశాలను ప్రాజెక్టుల రూపకల్పనకు జిల్లా విద్యా శాఖ ఇప్పటికే చర్యలు చేపట్టింది.

15 వరకు గడువు...

ఇన్‌స్పైర్-మనక్ ప్రాజెక్టుల కోసం ఆన్‌లైన్‌లో సెప్టెంబరు 15 వరకు గడువు ఉంది. జిల్లాలోని ప్రతి పాఠశాల నుంచి కొంగొత్త ఆలోచనలతో ప్రాజెక్టులను రూపొందించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించే బాధ్యతను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అప్పగించారు. పాఠశాలల నుంచే ప్రాజెక్టుల వివరాలను నమోదు చేయవచ్చు. సమస్య, దానికి పరిష్కార మార్గం, ఉపయోగాన్ని కచ్చితంగా వివరించాలి. ప్రధానంగా స్థానిక సమస్యలకు సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధారితంగా పరిష్కారం చూపించాలి. పర్యావరణం, ఆరోగ్యం, శక్తి సంరక్షణ, వ్యవసాయం, వ్యర్థ పదార్థాల వినియోగం వంటి విభాగాల్లో కొత్త ఆలోచనలపై దృష్టి సారించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా విద్యా శాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా కోరారు.



శాస్త్రీయ పరిష్కార మార్గాలు చూపాలి

గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం, కోనసీమ జిల్లా సైన్స్ అధికారి

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఇన్‌స్పైర్ అవార్డులు వేదికగా నిలిచాయి. విద్యార్థులు స్థానిక సమస్యలను గుర్తించి వాటికి శాస్త్రీయ పరిష్కార మార్గాలను చూపించే విధంగా ప్రాజెక్టులను రూపొందించాలి. అందుకు పాఠశాలల ఉపాధ్యాయులు సైతం విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేలా కృషి చేయాలి. ఆధునిక సమాజంలో పర్యావరణంతో పాటు వ్యర్థ పదార్థాలతో ఎదురవుతున్న సమస్యలపై దృష్టిసారించి పరిష్కార మార్గాలు కనుగొనాలి. గతంలో ప్రతిభ కనబరిచిన ప్రాజెక్టులను ఎంచుకోవద్దు. విద్యార్థుల ఉత్తమ ఆలోచనలకు దేశవ్యాప్తంగా అవార్డుతో పాటు ప్రతి ప్రాజెక్టుకు రూ.10వేలు చొప్పున నగదు బహుమతి అందజేస్తారు. జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచేలా ప్రాజెక్టుల రూపకల్పనకు కృషి చేయాలి.

ఖరీఫ్‌లో ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తాం!

- ఐదు జిల్లాల్లో 19.50 లక్షల మెట్రిక్ టన్నుల వరి సేకరణ లక్ష్యం
- ఉదయం నుంచి రాత్రి వరకు వరుసగా సమీక్షలు నిర్వహించిన మంత్రి నాదెండ్ల

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ ధాన్యం సేకరణపై ఏపీ పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడ కలెక్టరేట్ విధాన గౌతమి హాలులో శుక్రవారం వరుసగా సమీక్షలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు సివిల్ సప్లయిస్ అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు, సహకారశాఖ అధికారులు, రైస్‌మిల్లర్లు, రైతులు, పీఏసీఎస్ ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించారు. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ ఎలా సమర్థంగా చేయాలో మంత్రి వివరించారు. కాకినాడ జిల్లా, డాక్టరు బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, తూర్పుగోదావరి జిల్లా, పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు జిల్లాల్లో ఏ మేరకు ధాన్యం కొనుగోలు సేకరించాలో లక్ష్యం నిర్దేశించారు. మొత్తం ఐదు జిల్లాల్లో 19.50 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్ణయించారు.దీనిలో అత్యధికంగా పశ్చిమగోదావరి జిల్లాలో 5లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని నిర్దేశించారు. అలాగే తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లో 4లక్షల మెట్రిక్ టన్నుల చొప్పున సేకరిస్తారు. కోనసీమ జిల్లాలో 3.50 లక్షల మెట్రిక్ టన్నులు, కాకినాడ జిల్లాలో 3లక్షల టన్నులుగా నిర్ణయించారు. ఐదు జిల్లాల్లో 1234 రైతు సేవా కేంద్రాల ద్వారా 691 రైస్‌మిల్లులను అనుసంధానం చేసి సేకరణ ప్రక్రియ చేయాలని నిర్ణయించారు. ఏలూరు జిల్లాలో 70శాతం ఈ-క్రాప్ పూర్తిచేశామని వ్యవసాయ అధికారులు వెల్లడించారు.ఈ జిల్లాలో జంగారెడ్డిగూడెం, నూజివీడు ప్రాంతాల్లో బీపీటీ 5204 రకం ఎక్కువగా సాగు చేశామన్నారు. మెట్ట ప్రాంతంలో ఎంటీయూ 1262, 1224 రకాలను సాగు చేశామన్నారు.సన్నబియ్యం రకాల్లో 50శాతం వరకు మార్కెట్లోకి అమ్మకాలకు వెళ్తుందన్నారు. పంటలకు సస్యరక్షణ చర్యలు పాటిస్తున్నందున మంచి దిగుబడులు వస్తాయని ఆశిస్తున్నామన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న రాజానగరం, రాజమండ్రి రూరల్‌లో సన్న రకాలు ఎక్కువగా సాగు చేస్తున్నారని డీఎం గణేశ్‌కుమార్ వెల్లడించారు. ఈ జిల్లాలో ధాన్యం సేకరణకు 1.17 కోట్ల గోనె సంచుల వరకు అవసరం ఉందన్నారు. రైస్‌మిల్లర్ల వద్ద 81లక్షల గోనె సంచుల వరకు సిద్ధంగా ఉన్నాయన్నారు. తుపాన్లు వస్తే పంటలను రక్షించుకోవడానికి రైతులకు టార్పాలిన్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉంచామన్నారు. కాకినాడ జిల్లాలో 6.25లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా వేస్తున్నట్టు వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్ వెల్లడించారు.దీనిలో 5.01 శాతం ఉత్పత్తి బహిరంగ మార్కెట్‌కు వెళ్లే అవకాశం ఉందన్నారు. డెల్టా పరిధిలో స్వర్ణ 1318, మెట్ట ప్రాంతంలో సాధన, సంపద స్వర్ణ వంటి రకాలు నాటారన్నారు. గత ఏడాది ఖరీఫ్ కంటే అధిక ఉత్పత్తులు వస్తాయని అంచనా వేస్తున్నామన్నారు.అనంతరం పౌరసరఫరాల సంస్థ ఎండీ మంజీర్ జిలాని సామూన్ ధాన్యం సేకరణ ప్రక్రియ సమర్థంగా నిర్వహించేందుకు ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఆన్‌లైన్ పోర్టల్ పని విధానాన్ని వివరించారు.కార్యక్రమంలో ఏపీ పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, కాకినాడ జేసీ రాహుల్‌మీనా, కోనసీమ జేసీ నిశాంతి, పశ్చిమగోదావరి జిల్లా జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, కాకినాడ సివిల్ సప్లయిస్ డీఎం దేవుల నాయక్, కాకినాడ జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు రూ.వెయ్యి కోట్లు చెల్లించండి

- ఉమ్మడి జిల్లాల సమీక్షలో మంత్రి నాదెండ్లను కోరిన రైస్‌మిల్లర్లు
- పీఏసీఎస్ బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి
- పీఏసీఎస్‌లు ఆర్థిక పరిపుష్టికి సహకారం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైస్‌మిల్లర్లకు బకాయిపడిన రూ.వెయ్యి కోట్లు ప్రభుత్వం తక్షణమే చెల్లించి ఆదుకోవాలని రైస్‌మిల్లర్లు ప్రతినిధులు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోరారు. కాకినాడ కలెక్టరేట్లో శుక్రవారం మధ్యాహ్నం రైస్‌మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్), రైతు సంఘాల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా రైస్‌మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు వల్లూరి సూర్యప్రకాశ్‌రావు మాట్లాడుతూ రైస్ మిల్లులకు వివిధ చార్జీల కింద చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాలన్నారు. విదేశాలకు బియ్యం ఎగుమతులు ఆశించిన స్థాయిలో లేనందున ప్రభుత్వం ఖరీఫ్ ధాన్యం సేకరణ లక్ష్యాన్ని పెంచాలని కోరారు. కాకినాడ జిల్లా ధాన్యం సేకరణ లక్ష్యం 3లక్షల మెట్రిక్ టన్నులుగా నిర్దేశించారన్నారు. అయితే ఖరీఫ్‌లో 6 లక్షలకుపైగా మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తుంటే కేవలం 3లక్షల టన్నులను సేకరించడం తగదన్నారు. 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించే దిశగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.ఎంటీయూ రకాలతోపాటు బీపీటీ రకాలు, సన్నబియ్యాన్ని కూడా ప్రభుత్వ సేకరించాలని సూచించారు. కేరళకు ఆశించినస్థాయిలో ఎగుమతులు లేనందున రాష్ట్ర ప్రభుత్వమే ఎక్కువగా ధాన్యాన్ని సేకరించాలని తూర్పుగోదావరి జిల్లా, కోనసీమ జిల్లా మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నాదెండ్లను కోరారు.త్వరలో రుణాలు తీసుకుని రూ.వెయ్యి కోట్లు బకాయిలు తీర్చుతామని మంత్రి నాదెండ్ల మనోహర్ భరోసా ఇచ్చారు. జిల్లాలో పీఏసీఎస్‌లలో రైతులు తీసుకున్న బకాయిలు పేరుకుపోయాయని వాటిని చెల్లించాలా చర్యలు తీసుకోవాలని పీఏసీఎస్ ప్రతినిధులు కోరారు. ఎడ్ల బండ్ల ద్వారా కూడా రవాణాకు అనుమతించాలని రైతు ప్రతినిధులు కోరారు. రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోసుకునే అవసరం లేకుండా సామూహిక కళ్లాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రబీ సీజన్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ బియ్యాన్ని మిల్లర్లు పౌరసరఫరాల సంస్థకు పంపించాలని మంత్రి నాదెండ్ల కోరారు.

పెరుగుతున్న గోదావరి

3,46486 క్యూసెక్కులు దిగువకు..

ధవళేశ్వరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎగువన కురిసిన వర్షాలకు ఉప నది ప్రాణహిత ద్వారా వరద నీరు చేరుతుండంతో గోదావరి పెరుగుతూ ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహాన్ని అంచనా వేస్తూ ధవళేశ్వరం వద్ద గోదావరి బేసిన్‌ను ఖాళీ చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ గేట్లను మరింత పైకి ఎత్తి 3,46486 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.దీంతో ధవళేశ్వరం వద్ద నీటిమట్టం గణనీయంగా తగ్గి 8.60 అడుగులుగా నమోదయింది. ఇప్పటికే భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం క్రమం పెరుగుతూ శుక్రవారం సాయంత్రానికి 27.10 అడుగులకు చేరుకుంది. కాటన్ బ్యారేజ్ నుంచి వ్యవసాయ అవసరాలకు డెల్టా కాలువలకు 12,200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాకు 4200 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 2000క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 6000వేల క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

కోరుకొండ నరసన్న పవిత్రోత్సవాలు



ఆలయ ముఖ మండపంలో స్వామివారికి అర్చన చేస్తున్న దృశ్యం

కోరుకొండ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి పవిత్రోత్సవాలు స్వామివారి ఆలయ ముఖ మండపం అంగరంగ వైభవంగా సాగుతున్నాయి.లోక కల్యాణార్థం చక్రవర్తుల సతీష్‌కుమార్ ఆచార్యులు, వాకాని మణికంఠాచార్యులు కైంకర్యంతో వంశపారంపర్య ధర్మకర్త ఎస్‌పీ రంగరాజ భట్టర్, అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు ఆధ్వర్యంలో పవిత్రోత్సవాలను వైకానస భగవత్ ఆగమన శాస్త్రం, శ్రీ వైష్ణవ భగవత్ ఆగమ శాస్త్రం, శ్రీ వైష్ణవ సాంప్రదాయాల ప్రకారం ద్రవిడ ప్రబంధం, ద్రవిడ ప్రబంధన, వేద పారాయన నిర్వహిస్తున్నారు. ఆగమ పండితులు పాణింగపల్లి సత్యపవన్‌కుమార్ ఆచార్యులు బృహ్మత్వంలో శుక్రవారం స్వామివారికి విశ్వక్సేణారాధన, అష్ట కలశస్నాపన, అభిషేకం, పవిత్రారోపణం, లక్ష్మీనరసింహ సుదర్శన మహా మంత్రయజ్ఞము, తులసి దళంతో స్వామి వారికి సహస్రనామార్చన విశేష నివేదన జరిగాయి.రాత్రి స్వామి వారికి పల్లకి సేవ నిర్వహించి అనంతరం మహాశాంతి ప్రధాన హోమాలు నీరాజన మంత్ర పుష్పాలు నిర్వహించారు. కార్యక్రమాలు స్వామి వారి అనువంశక అర్చక స్వాములు, పెదపాటి, పెద్దింటి, పెరవళి, వారి స్వీయ పర్యవేక్షణలో అనువంశక ధర్మకర్త శ్రీ పరాసర రంగరాజ భట్టర్, అన్నవరం దేవస్థానం అధికారులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్: పీడీజే సునీత

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో శనివారం(నేడు) నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌కి 42 న్యాయ పీఠాలను(బెంచ్‌లు) ఏర్పాటు చేశామని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి అర్హమైన క్రిమినల్, సివిల్, కుటుంబ వివాదాలు, చెక్ బౌన్స్ ప్రమాదాలు, బ్యాంకు, ప్రీ-లిటిగేషన్ తదితర కేసులను పరిష్కరించుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.

15న నన్నయ యూనివర్శిటీలో అద్విక-25



అద్విక పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 15న అద్విక-25 సాంకేతిక ఉత్సవం నిర్వహిస్తున్నట్టు ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టరును ఆమె శుక్రవారం ఆవిష్కరించారు. ఇంజనీర్ల దినోత్సవం సందర్భంగా దీనిని నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం పోస్టర్, పేపర్ ప్రజెంటేషన్‌లు, టెక్ క్విజ్, ప్రాజెక్టు ఎక్స్‌పో, లఘుచిత్ర నిర్మాణం, స్కిల్ హౌస్ వంటి సాంకేతిక పోటీలు నిర్వహించారు. వీటిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అద్విక వేదికపై బహుమతులు ప్రదానం చేయనున్నారు.

నూతన ఉప రాష్ట్రపతికి ఎంపీల శుభాకాంక్షలు



భారత నూతన ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌ను శుక్రవారం మధ్యాహ్నం ఢిల్లీలోని ఆయన చాంబర్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఇద్దరు ఎంపీలు మర్యాదపూర్వకంగా కలిశారు. రాధాకృష్ణన్‌కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం లోక్‌సభ సభ్యుడు గంటి హరీష్‌మాధుర్‌తో పాటు కాకినాడ జిల్లాకు చెందిన రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు.

అమలాపురం/సామర్లకోట (ఆంధ్రజ్యోతి)

చిన్నారికేం తెలుసు... కలెక్టర్ అని!



ఈ చిన్నారి కాకినాడ జిల్లా సామర్లకోటలోని సిరి దివ్యాంగ పాఠశాలలో చదువుతోంది. మాటలు, నడక అంతగా రాకపోగా బుద్ధిమాంద్యంతో పాఠాలు నేర్చుకుంటోంది. శుక్రవారం పాఠశాల సందర్శనకు వచ్చిన కలెక్టర్ షాన్‌మోహన్‌కు తన చేతిని అందించి ఏదో మాట్లాడేందుకు ప్రయత్నించింది. దీంతో ఆయన వెంటనే స్పందించి తన చేతిని ఆ చిన్నారికి అందించడంతో నవ్వులు, కేరింతలతో ఆ చిన్నారి ఆనందపడింది. మిగిలిన దివ్యాంగ విద్యార్థులు సైతం నవ్వుల్లో మునిగారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి)

సామర్లకోట భీమేశ్వరుని సన్నిధిలో...



కాకినాడ జిల్లా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయానికి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం సీనియర్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ అనిరధ మేడోజు లక్ష్మా శుక్రవారం రాత్రి విచ్చేశారు. న్యూఢిల్లీ నుంచి ప్రత్యేక వాహనంలో వచ్చిన ఆమెకు ఆలయ పండితులు, దేవదాయ శాఖ సిబ్బంది సాదర స్వాగతం పలికారు. అనంతరం లక్ష్మా భీమేశ్వరస్వామికి, బాలాత్రిపురసుందరి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. నంది మండపం వద్ద పండితులు వేదాశీర్వచనం ఇచ్చి ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలు అందజేశారు. జిల్లా మెడికల్ అధికారి విల్సన్, హెచ్ఏ శ్రీనివాసు, ఎంపీహెచ్ఏ మహారాజ్‌కుమార్, డీఈవో అడపా సూర్యప్రసాద్ (బాబీ) పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి)

భీమేశ్వరాలయంలో ఆదాయపన్ను శాఖ డీజీ పూజలు



భీమేశ్వరాలయంలో పూజలు చేస్తున్న డీజీ రాజేశ్వర్ బైవర్

ద్రాక్షారామ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక భీమేశ్వరాలయాన్ని శుక్రవారం ఆదాయపన్నుశాఖ ఏపీ, తెలంగాణ, ఒరిస్సా రాష్ట్రాల డీజీ ఆనంగ్ రాజేశ్వర్ బైవర్ కుటుంబ సమేతంగా సందర్శించారు. భీమేశ్వరస్వామి, మాణిక్యాంబను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దర్శన అనంతరం వేదపండితులు ఆశీర్వచనం అందుకున్నారు.

సోలార్ బ్యాటరీల చోరీకి యత్నం?

కిరాయి డబ్బుల చెల్లింపులో తేడా రావడంతో బయటపడ్డ వ్యవహారం

కూనవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొండరెడ్ల ఇళ్లల్లో ప్రభుత్వం మంజూరు చేసిన సోలార్ లైట్లు బ్యాటరీలు గుట్టు చప్పుడు కాకుండా కొంతమంది వ్యక్తులు స్వాహా చేసేందుకు ప్రయత్నించారు. ఈ వ్యవహారంపై మూల్లూరు గ్రామస్థులకు అనుమానం రావడంతో వాటిని పట్టుకొని అదే గ్రామంలో ఓ రైతు ఇంట్లో వాటిని భద్రపరిచారు. వివరాల్లోకి వెళితే... కూనవరం మండలం కూటూరు గుట్టపై కారుమానుకొండ కోపిరిమెట్ట, గబ్బిలాల గొంది, వెలుగుల గొంది, తోటమామిడి గొంది, చింతగండి, పులుసుమామిడి గొంది, కళింగ మిద్దె తదితర గ్రామాల్లో కొండరెడ్లు నివసిస్తున్నారు. ప్రభుత్వం వీరికి సోలార్ లైట్లు మంజూరు చేసింది. అయితే వీటికి సంబంధించిన బ్యాటరీలు పాతవి అయ్యాయని వీటి స్థానంలో కొత్త బ్యాటరీలు అందిస్తామని కొంతమంది గుట్ట ఎక్కి ఆ గ్రామాలకు సంబంధించిన 120 బ్యాటరీలు గతంలో తీసుకెళ్లారు. మళ్లీ గురువారం ఓ వ్యక్తి ఫోన్ ద్వారా భద్రాచలంలో ఓ వాహనాన్ని రూ.3 వేలకు కిరాయికి మాట్లాడుకొని, తాను వాహనం వెంట రాకుండా ఆ వాహనాన్ని కూటూరు గుట్ట వద్దకు పంపాడు. అప్పటికే బ్యాటరీలు గుట్టపై నుంచి కిందకి దింపిన కొండరెడ్లు ఆ వాహనంలోకి ఎక్కించారు. అయితే వాహనాదారుడు తనకు కిరాయి డబ్బులు ఇవ్వాలని కిరాయి మాట్లాడుకున్న వ్యక్తికి ఫోన్ చేశాడు. అయితే రెండుమూడు గంటలైనా కిరాయి డబ్బులు చెల్లించకపోవడంతో వాహనదారుడు వాహనాన్ని అక్కడే నిలిపివేశాడు. వాహనం ఎక్కువసేపు అక్కడే నిలిచిపోవడంతో పక్క ఊరైన ముల్లూరు గ్రామస్థులకు అనుమానం వచ్చింది. ఇదేంటని ఈ బ్యాటరీలు ఎక్కడికి వెళ్తున్నాయని డ్రైవర్‌ను నిలదీయడంతో జరిగిన విషయం మొత్తం గ్రామస్థులకు తెలిపాడు. అయితే ఆ వ్యక్తి ఫోన్ నెంబరు డ్రైవర్ దగ్గర తీసుకొని గ్రామస్థులు ఎన్నిసార్లు ప్రయత్నించినా అతని దగ్గర నుంచి సమాధానం రాకపోవడంతో తమను మోసం చేస్తున్నారని కొండరెడ్లు సైతం మేల్కొని ఆ వాహనం వెళ్లకుండా అడ్డుకున్నారు. వాహనంలో ఉన్న 48 బ్యాటరీలను గ్రామంలోని కన్నారావు అనే రైతు ఇంట్లో ఉంచారు. కన్నారావు ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో దీని వెనుక ఎవరున్నారని కోణంలో ఎస్ఐ లతాశ్రీ దర్యాప్తు చేస్తున్నారు.

ముంపు లెక్క మార్పు


ఇటీవల వరదలు సంభవించినప్పుడు ముంపులో కూనవరం (ఫైల్)

- విలీన మండలాల్లో రోజుల తరబడి వరద ఉధృతి
- పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావం
- రాకపోకలకు అంతరాయం
- గ్రామస్తుల్లో వీడని భయం

చింతూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా వరదలు రావడం సహజమే. లోతట్టు వాసులు అవస్థలు పడడమూ మామూలే. కాగా ఇటీవల పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావంతో ముంపు లెక్క గతంతో పోల్చితే పెరిగింది. దీంతో విలీన మండలాల్లో ముంపు లెక్క మారింది. రోజుల తరబడి లోతట్టు గ్రామాల్ని వరద నీరు చుట్టుముట్టి ఉంటోంది. ఈ క్రమంలో తాజాగా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో 2 దఫాలుగా 28 రోజుల పాటు విలీన మండలాల్లో రాకపోకలు నిలిచి పోయాయి. భద్రాచలం వద్ద గోదావరి నది ఉధృతి 43 అడుగులు చేరుకుంటే మొదటి ప్రమాద హెచ్చరిక, 48 అడుగులకు చేరుకుంటే రెండో ప్రమాద హెచ్చరిక, ఇక 53 అడుగులకు చేరుకుంటే మూడో ప్రమాద హెచ్చరికగా ప్రకటించడం జరుగుతుంది. అదే సమయంలో గోదావరి పెరుగుదలతో పాటు విలీన మండలాలకు ఎగువనున్న ఛత్తీస్‌గఢ్, ఒడిస్సాలో ఎడతెరిపిలేకుండా వర్షాలు కురిసిన పక్షంలో శబరి, గోదావరి నదులు ఉధృతి కూడా పెరిగి చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాల్లో ఆ ప్రభావం పడుతుంది. దీంతో విలీన మండలాల్లోని లోతట్టు ప్రాంతాలతో సహా ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా రాష్ట్రాలకు కూడా రాకపోకలు నిలిచిపోతుంటాయి. దశాబ్దాలుగా ఈ స్థితి అనుభవమే.

తాజాగా 14 లక్షల క్యూసెక్కుల రికార్డు..!

తాజాగా వరద కూడా సాధారణ స్థాయికి చింతూరు వద్ద చేరుకోవడానికి 28 రోజులు పట్టింది. ఈ ఏడాది ఆగస్టు 21న భద్రాచలం వద్ద 51.9 అడుగులు మేర గోదావరి ప్రవహించగా అదేరోజు అధికారులు వేసిన అంచనాకు మించి 4 అడుగుల ఉధృతి ఎక్కువగా ప్రవహించినట్టు గుర్తించారు. అదే సమయంలో భద్రాచలంకు 11.50 లక్షల క్యూసెక్కుల వరద నీరు ఎగువ నుంచి చేరగా బ్యాక్ వాటర్ ప్రభావంతో భద్రాచలం వద్ద 14 లక్షల క్యూసెక్కుల వరద నీరు ఉధృతి రికార్డు అయినట్టు అధికారిక గణాంకాలు తేల్చి చెప్పాయి. దీనికి కారణం పోలవరం బ్యాక్ వాటరేనని అధికారులు స్పష్టం చేశారు. మొత్తం మీద పోలవరం బ్యాక్ వాటర్‌తో విలీన మండలాల్లోని లోతట్టు గ్రామస్థులు వర్షాకాలంలో భయం భయంగా నిద్రలేని రాత్రులు గడపాల్సిన స్థితి ఉంది.

గణాంకాలు ఇలా...

కాగా పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావం లేని కాలంలో శబరి, సీలేరు వరద ఉధృతి ఎంత వేగంగా పెరిగేదో అంతే వేగంతో వరద ఉధృతి తగ్గేది కూడా. అదేదశలో భద్రాచలంలో గోదావరి నీటి మట్ట 2 అడుగులు తగ్గితే చింతూరు వద్ద శబరి నీటి మట్టం 5 అడుగులు మేర తగ్గేది. కాగా ఇప్పుడా పరిస్థితి కానరావడం లేదు. భద్రాచలంలో గోదావరి ఉధృతి ఒక అడుగు తగ్గినా శబరి నీటి మట్టం మాత్రం నిలకడగానే ఉంటోంది. దీనికి కారణం కూనవరం వద్ద ఎగపోటునిచ్చిన పోలవరం బ్యాక్ వాటర్ దిగువకు వరదను వేగంగా పోనీకుండా అడ్డుకోవడమే. 2022 నుంచి ఈ పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. 1986 ఆగస్టు 16న భద్రాచలం వద్ద గరిష్ఠంగా 75.6 అడుగుల మేర వరద ఉధృతి నమోదైంది. నాడు భద్రాచలం వద్ద 27.02 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రవహించినట్టు అధికార గణాంకాలు చెబుతున్నాయి. ఆ సందర్భంలో గోదావరికి తోడుగా శబరి, సీలేరు నదులు కూడా ఉధృతంగా ప్రవహించడంతో మూడు నదుల ఉధృతి ఏకమై విలీన మండలాలు పెద్ద ఎత్తున ముంపునకు గురయ్యాయి. 2022 జూలై 16న భద్రాచలం వద్ద 71.03 అడుగుల ప్రవాహంతో 24.43 లక్షల క్యూసెక్కులు వరద నమోదైంది. ఆ సమయంలో శబరి, సీలేరు నదుల ఉధృతి అంతగాలేనప్పటికి కేవలం గోదావరి వదర ఉధృతి పెరిగి తద్వారా పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావంతో విలీన మండలాల్లో ముంపు చూస్తూచూస్తూనే పెరిగిపోయింది. అంతేకాదు బ్యాక్ వాటర్ ప్రభావంతో భద్రాచలం వద్ద నీటిమట్టం సాధారణ స్థాయి (30 అడుగులు)కి చేరుకోనేందుకు దాదాపు రెండు నెలలు పట్టింది.

ప్రసాద్ స్కీం పనులు పూర్తి చేస్తాం

- టూరిజంశాఖ చీఫ్ ఇంజనీరు వెంకటేశ్వరరావు
- అన్నవరంలో అన్నదాన భవన నిర్మాణ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న అధికారులు

అన్నవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకమైన ప్రసాద్ స్కీం ద్వారా చేపడుతున్న సుమారు రూ.19.32 కోట్లు విలువైన పనులు వచ్చే ఏడాది ఆగస్టు నాటికి పూర్తి చేస్తామని టూరిజంశాఖ చీఫ్ ఇంజనీరు వెంకటేశ్వరరావు తెలిపారు.శుక్రవారం కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో అన్నదాన భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనుల నాణ్యతలో రాజీపడేదిలేదని స్పష్టం చేశారు. ఈ నిర్మాణాలు పూర్తి అయితే భక్తులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో టూరిజం శాఖ ఈఈ భాస్కరరావు, దేవస్థానం ఈఈ వి.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఘనంగా చండీహోమం


హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

అన్నవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం రత్నగిరి క్షేత్రరక్షకి అయిన వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితుల గణపతి పూజ, పుణ్యాహావచనం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పారాయణలు, జపములు శాస్త్రోక్తంగా జరిగాయి. 11గంటలకు హోమ పూర్ణాహుతి జరిగింది. ఈవో సుబ్బారావు దంపతులు పాల్గొన్నారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి

రంప ఐటీడీఏ పీవోగా స్మరణ్ రాజ్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన స్మరణ్ రాజ్

రంపచోడవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రంపచోడవరం ఐటీడీఏ పీఏ స్మరణ్ రాజ్ అన్నారు. శుక్రవారం ఆయన ఐటీడీఏ పీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు చేపడతామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందేలా చర్యలు చేపడతామన్నారు. ఏపీవో(జీ) డీఎన్వీ రమణ, డిప్యూటీ డైరక్టర్ రుక్మాండయ్య, పీహెచ్‌వో దేవదానం, జీసీసీ డీఎం జయశ్రీ, ఏడీఎంహెచ్‌వో డేవిడ్, డీడీ కార్యాలయ సూపరింటెండెంట్ బి.కిషోర్, ఈఈ ఐ.శ్రీనివాసరావు, డీఎల్‌డీవో కె.కోటేశ్వరరావు, ఎంపీపీ బంధం శ్రీదేవి, జడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ కె.బాలకృష్ణ, ఎంపీటీసీలు తుర్రం వెంకటేశ్వరావు, కుంజం వంశీ, ఉలవల లక్ష్మి, తహశీల్దార్లు తదితరులు ఐటీడీఏ పీవోను మర్యాదపూర్వకంగా కలిశారు.

'అరటి నార ఉత్పత్తులతో ఆర్థిక భరోసా'



కొవ్వూరు అరటి పరిశోధనా కేంద్రంలో శిక్షణ తరగతుల్లో పాల్గొన్న మహిళలు

కొవ్వూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అరటినార ఉత్పత్తుల తయారీ ద్వారా మహిళలు ఆర్థిక భరోసా సాధించవచ్చని కొవ్వూరు ఉద్యాన పరిశోధన కేంద్రం సంచాలకుడు డా.వెంకటస్వామి తెలిపారు. శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు అరటి పరిశోధనా కేంద్రంలో నాబార్డు ఆర్థిక సహకారంతో మహిళలకు అరటి బొందెల ద్వారా నార, ఇతర ఉత్పత్తుల తయారీపై శిక్షణ నిర్వహించారు. సీనియర్ శాస్త్రవేత్త డా.కె.రవీంద్రకుమార్ మాట్లాడుతూ నవంబరులో 25 రోజుల పాటు జరిగే అరటి బొందెల నుంచి నార, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ శిక్షణలో పాల్గొనడానికి ఆసక్తి కలిగిన మహిళలు తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలన్నారు. డా.వెంకటస్వామి మాట్లాడుతూ ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాబార్డు డీడీఎం చక్రధర్ మాట్లాడుతూ శిక్షణ ద్వారా మహిళలు మరింత ఆర్థిక సంవృద్ధిని సాధించవచ్చన్నారు. శిక్షణలో పాల్గొనే మహిళలు ఉద్యాన పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డా.రవీంద్రకుమార్ 9491838982లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారి సుధీర్, ఎన్‌జీవో ప్రసాద్, శాస్త్రవేత్తలు డా.పి.లలిత కామేశ్వరి, డా.కె.మమత, డా.ఏ.స్నేహలతరాణి, డా.వై.శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్ తగిలి ఐదు గేదెల మృతి


బూరుగుపూడి గ్రామంలో మృతిచెందిన గేదెలు

కోరుకొండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం బూరుగుపూడి గ్రామంలో తోటల మధ్య నుంచి వెళ్లిన 11కేవీ విద్యుత్ వైరు తెగి పడడంతో ఆ పరిసరాల్లో మేత మేస్తున్న గ్రామానికి చెందిన నక్కా శ్రీనుకు చెందిన 5 గేదెలు గురువారం రాత్రి విద్యుత్ షాక్‌తో మృతి చెందాయి. శుక్రవారం ఉదయం పొలానికి వెళ్లిన రైతు గేదెలు మృతి చెందడాన్ని చూసి బోరున విలపించాడు. విషయం గ్రామంలోని రైతులకు తెలియడంతో వారు విద్యుత్ శాఖ అధికారులు, పశు సంవర్ధక శాఖ అధికారులకు తెలియజేశారు. వెంటనే 5 గేదెలకు పోస్టుమార్టం నిర్వహించారు. చట్టప్రకారం రైతుకు రావాల్సిన నష్టపరిహారాన్ని అందించే ఏర్పాటు చేస్తామని అధికారులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు కంటే నాగ కేశవరావు, జనసేన నాయకుడు అడపా శ్రీనివాస్ సంఘటనా స్థలానికి వెళ్లి రైతును ఓదార్చారు.

మండపేటలో...
నేటి నుంచి రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలు

మండపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో ఈనెల 13,14 తేదీల్లో 49వ రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలను జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోటీలు నిర్వహిస్తామని టెన్నికాయిట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలు అప్పసాని కృష్ణకుమారి తెలిపారు. పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి 200 జట్లు హాజరవుతున్నాయని రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ రిఫరీ కుంచే రమేష్ తెలిపారు. వారిలో 100 మంది బాలురు, 100 మంది బాలికలు పాల్గొంటారని చెప్పారు. పట్టణంలోని అన్నపూర్ణ హైస్కూల్లో బాలికలకు.. ప్రభుత్వ హైస్కూల్లో బాలురకు వసతి కల్పించామన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 12మంది రిఫరీలు హాజరవుతున్నారన్నారు.

కేజ్ కల్చర్‌కు ఏలేరు ప్రాజెక్టు

ప్రభుత్వం ఉత్తర్వులు



ఏలేశ్వరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేజ్ కల్చర్ (చేప పిల్లలను బాక్సుల్లో పెంచడం)కు కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని ఏలేరు జలాశయాన్ని విశాఖపట్నంలోని మిస్సర్స్ ఫిషస్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్‌కు అప్పగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా మడ్డువలస రిజర్వాయర్‌తో పాటు కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో ఏలేరు ప్రాజెక్టులలో పై కంపెనీ చేపల పెంపకాన్ని చేసుకునేందుకు కంపెనీకి అనుమతి లభించింది. ప్రారంభంలో ఆర్థికంగా పెట్టుబడి పెట్టేందుకు ప్రయివేటు లిమిటెడ్ సంస్థ అంగీకారం తెలిపినట్టు ఉత్తర్వుల్లో ప్రభుత్వం వెల్లడించింది. దశలవారీగా చేపల పెంపకంపై మత్స్యకారులకు శిక్షణ, ఉపాధి కల్పించేందుకు లిమిటెడ్ కంపెనీ ముందుకు వచ్చింది. సదరు కంపెనీకి మందస్తు అనుభవం ఉండడంతో ఎంపికలో ప్రాధాన్యత ఇచ్చినట్టు తెలుస్తోంది.


ఏలేరులోకి చేప పిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే, కలెక్టర్

చేప పిల్లల విడుదల

ఏలేశ్వరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏలేరు జలాశయంలో ప్రభుత్వం సమకూర్చిన పదివేల చేప పిల్లలను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ విడుదల చేశారు. వారు మాట్లాడుతూ మత్స్యకారుల జీవనోపాధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సీడీలపై వాహనాలు, పరికరాలు అందిస్తున్నాయన్నారు. ఏలేరు జలాశయంలో చేపల పెంపకం ద్వారా పరిసర ప్రాంతాల్లో మత్స్యకారులకు ఉపాధి పెరుగుతుందన్నారు. ఏలేరు ప్రాజెక్టు చైర్మన్ బస్వా వీరబాబు, ఎంపీడీవో సూర్యనారాయణ, టీడీపీ మండలాధ్యక్షుడు జ్యోతుల పెదబాబు, కౌన్సిలర్లు బొది రెడ్డి గోపి, మూది నారాయణస్వామి పాల్గొన్నారు.

టేకులబోరులో కొండచిలువ హల్‌చల్

- పట్టుకునేందుకు అటవీ శాఖ సిబ్బంది ప్రయత్నం
- దొరకకపోవడంతో గ్రామస్తుల్లో భయం



కూనవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా కూనవరం మండలం టేకులబోరు గ్రామంలో కొండచిలువ హల్ చల్ చేసింది. గురువారం రాత్రి గ్రామంలోని పాదం ఆనంద్ ఇంటి ఆవరణలోకి కొండచిలువ వచ్చింది. దీంతో గ్రామస్తులందరూ అక్కడికి చేరుకున్నారు. కొండచిలువ సుమారు 15 అడుగుల పొడవుతో పాటు లావుగా కనిపించడంతో గ్రామస్తులు భయంతో అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో కొంతమంది అటవీ సిబ్బంది దానిని కర్రలతో పట్టుకునే ప్రయత్నం చేశారు. సుమారు అరగంట పాటు అది చిక్కనట్టే చిక్కి తప్పించుకుని పోయింది. శుక్రవారం ఉదయం సుమారు పదిమందికి పైగా సిబ్బంది అక్కడికి చేరుకుని దానిని వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. కొండచిలువ ఇంకా దొరకకపోవడంతో మళ్లీ ఎక్కడ వస్తుందోనని ప్రజలు భయపడుతున్నారు.

బాలికపై అత్యాచారం..
ఇద్దరిపై పోక్సో కేసు

గోకవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకుడు, బాలుడిపై శుక్రవారం పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం గ్రామానికి చెందిన గునుపే కిరణ్‌కుమార్, మరో బాలుడు కలిసి ఓ బాలికను మాయ మాటలతో ఆకర్షించి అత్యాచారానికి పాల్పడినట్టు బాధితురాలి కుటుంబసభ్యుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేశామన్నారు. అత్యాధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఇద్దరి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

బాలికను మోసగించిన యువకుడిపై..

కొవ్వూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణానికి చెందిన 10వ తరగతి చదువుతున్న మైనర్ బాలికను అదే ప్రాంతానికి చెందిన యువకుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసినట్టు బాలిక తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్టు సీఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

అల్లవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలంలోని ఓ గ్రామంలో 16 ఏళ్ల మైనరు బాలిక ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్‌ఐ బి.సంపత్‌కుమార్ తెలిపారు. 5రోజుల కిందట పురుగుల మందు తాగిన బాలికను తక్షణం మెరుగైన వైద్యసాయం కోసం కాకినాడ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారన్నారు. కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆ బాలిక మృతిచెందిందని ఎస్‌ఐ చెప్పారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు.

బస్సులో 600 గ్రాముల బంగారు వస్తువుల మాయం

గండేపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి బంగారు వస్తువులను పోగొట్టుకున్నాడు. దీనికి సంబంధించి గండేపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరుకు చెందిన అంబూరి మునిరాజు నెల్లూరు శ్రీ గోల్డ్ జువెలరీ షాపులో పనిచేస్తున్నాడు. తరచూ అతడి యాజమాని చెప్పిన ప్రకారం విజయనగరం, విశాఖపట్నం ప్రాంతాల్లో గోల్డ్ షాపులకు బంగారు వస్తువులు పట్టుకుని వెళ్తుంటాడు. అదేవిధంగా 2 రోజుల క్రితం నెల్లూరి నుంచి 1200 గ్రాముల బంగారు వస్తువులు పట్టుకుని వచ్చి విజయనగరం, వైజాగ్‌లో సుమారు 600 గ్రాముల గోల్డ్ వస్తువులు షాపులకు ఇచ్చాడు. మిగిలిన 600 గ్రాముల గోల్డ్ వస్తువులతో ఈనెల 10న నెల్లూరు వస్తుండగా కాకినాడ జిల్లా గండేపల్లి మండలం తాళ్లూరు హనీ దాబా వద్దకు వచ్చేసరికి బస్సు డ్రైవర్ రాత్రి సుమారు 8:30 గంటల సమయంలో భోజనం నిమిత్తం ఆపాడు. మునిరాజు బస్సు దిగి భోజనం చేసి మళ్లీ తిరిగి చూసుకునేసరికి తన బ్యాగు, అందులో ఉన్న 600 గ్రాముల బంగారు వస్తువులు (చెవి దిద్దులు, గాజులు) కనిపించకుండా పోయాయి. దీనిపై అతడు గండేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఎల్‌ఎన్‌పురంలో బంగారం, వెండి వస్తువుల చోరీ

పిఠాపురం రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం ఎల్‌ఎన్‌పురంలో బంగారు, వెండి ఆభరణాలు చోరీ అయ్యాయి. గ్రామానికి చెందిన గంపా నిర్మల కాకినాడలోని బంధువుల ఇంటికి వెళ్లి గురువారం రాత్రి తిరిగి వచ్చింది. ఇంటి లోపలికి వెళ్లి చూసుకునేసరికి బీరువా తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించి పరిశీలించగా బీరువాలో ఉంచిన 13 కాసుల బంగారం నగలు, 19 తులాల వెండి, సుమారు రూ.2లక్షల వరకూ నగదు చోరీకి గురైనట్టు గుర్తించింది. పిఠాపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం ఇంటిని పరిశీలించి ఆధారాలు సేకరించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

కొవ్వూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందినట్టు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు. పోలీసులు వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం కామరాజుపేటకు చెందిన మేకల వీర్రాజు(60) కొంతకాలంగా కొవ్వూరు పట్టణం టాక్సీస్టాండ్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. ఈనెల 6న వీర్రాజు సైకిల్‌పై కామరాజుపేట వెళ్లి 7న తిరిగి వస్తుండగా గామన్‌బ్రిడ్జిపై 46 స్తంభం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. వీర్రాజు తలకు తీవ్ర రక్త గాయం కావడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. హైవే అంబులెన్స్ సిబ్బంది వీర్రాజును కొవ్వూరు, అనంతరం రాజమహేంద్రవరం తరలించారు. చికిత్స పొందుతూ వీర్రాజు గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

తల్లీకొడుకు అదృశ్యంపై కేసు

గొల్లప్రోలు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కుమారుడితో కలిసి తల్లి అదృశ్యంపై గొల్లప్రోలు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడలో ప్రస్తుతం నివాసముంటున్న నక్కా సింహాచలం గతంలో సామర్లకోటలో కుటుంబసభ్యులతో కలిసి ఉండేది. వారితో విభేదాలు రావడంతో దుర్గాడలో భర్తతో కలిసి నివాసముంటోంది. ఈనెల 10వ తేదీ ఉదయం 10.30 గంటల సమయంలో తన కుమారుడు నక్కా చైతన్య (3)ను తీసుకుని ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. తిరిగి రాకపోవడంతో బంధువులు, ఇతర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మేనమామ శివకోటి నూకరాజు శుక్రవారం గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

మద్యం మత్తులో...

- బైక్‌ను ఢీకొన్న కారు
- భార్యాభర్తలకు తీవ్ర గాయాలు


ప్రమాదానికి కారణమైన కారు

జగ్గంపేట రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట శివారు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే జగ్గంపేట మండలంలోని మన్యవారిపాలెం గ్రామానికి చెందిన పోట్రు శ్రీను (39), పోట్రు వీర అశ్వినీ (29) భార్యభర్తలు. గురువారం ఉదయం రాజమండ్రి ఆసుపత్రికి ఇంటి నుంచి మోటార్ సైకిల్‌పై పయనమై జగ్గంపేట ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద వాహనం ఉంచారు. తిరిగి రాత్రి 10 గంటల సమయంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దిగి అక్కడ ఉంచిన బైక్‌పై తిరిగి మన్యం వారి పాలెం బయలుదేరారు. గోకవరం రోడ్డులో బ్రాందీ షాపు వద్దకు వచ్చేసరికి జగ్గంపేట వైపు వెళ్తున్న కారు బైక్‌పై ఎడమవైపు వెళ్తున్న ఆ దంపతులను ఢీకొని పక్క నున్న తాడిచెట్టుకు గుద్దుకుని ఆగింది. బైక్‌పై వెళ్తున్న దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే రాజమండ్రిలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోట్రు శ్రీను కాలు నుజ్జునుజ్జు అయ్యింది. కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడపడమే కాకుండా మద్యం మత్తులో ఉన్నట్టు ఎస్‌ఐ రఘునాథరావు తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు


సుంకటరేవు వద్ద ప్రమాద దృశ్యం

తాళ్లరేవు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పోలేకుర్రు పంచాయతీ పరిధి సుంకటరేవు 216 జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైనట్టు కోరింగ ఎస్‌ఐ పి.సత్యనారాయణ తెలిపారు. తాళ్లరేవు నుంచి రొయ్యల లోడుతో బొలెరా వ్యాన్ యానాం వైపునకు వెళ్తుండగా సుంకటరేవు వద్ద సుంకరపాలెం నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న నాగాబత్తుల షడ్రాక్‌ను ఢీకొంది. దీంతో తలకు తీవ్రగాయమై అపస్మారకస్థితి చేరుకున్నాడు. కోరింగ పోలీసులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి 108లో తరలించారు. ఎస్‌ఐ పి.సత్యనారాయణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ, ఎక్స్‌కవేటర్ల సీజ్

రౌతులపూడి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం ఎస్.పైడిపాల గ్రామం తాలొద్దులో ఈసీ అనుమతి లేని క్వారీలో లారీ, ఎక్స్‌కవేటర్లను మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. మైనింగ్ అధికారులు సత్యతేజ, రవీంద్ర శుక్రవారం దాడులు నిర్వహించి అనుమతులు లేని క్వారీలో ఒక లారీ, 2 ఎక్స్‌కవేటర్లను సీజ్ చేశారు.


సీజ్ చేసిన లారీ, ఎక్స్‌కవేటర్

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

15న కొత్తపల్లి మండల సమావేశం

కొత్తపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 15న జరుగుతుందని ఎంపీడీవో ఎ.లక్ష్మీరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ కారే సుధాశ్రీనివాసరావు అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీల కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలన్నారు.


రైల్వే బ్రిడ్జి కింద నీరు నిలిచిపోవడంతో దాటేందుకు విద్యార్థుల పాట్లు

గొల్లప్రోలు రైల్వే బ్రిడ్జి కిందకు నీరు

సూరంపేట వాసుల ఇక్కట్లు

గొల్లప్రోలు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణ శివారు సూరంపేటకు వెళ్లే మార్గంలోని రైల్వే బ్రిడ్జి కిందకు వర్షపు నీరు, సుద్దగడ్డ కాలువలోని నీరు చేరింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే సూరంపేట వాసులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీటిలో వెళ్లడం ప్రమాదకరమని తెలిసినా బ్రిడ్జికి చేర్చి ఉన్న చిన్న గట్టుపై సైకిళ్లు, వాహనాలు నడిపించుకుంటూ దాటుతున్నారు. ఊబంద కాలువపై సూరంపేటకు వెళ్లేందుకు బ్రిడ్జి నిర్మాణం పూర్తయినా అప్రోచ్ రోడ్డు నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఈ మార్గంలోనే రాకపోకలు సాగించాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఆర్చరీ పోటీలకు ఎంపికైన వారిని అభినందిస్తున్న దృశ్యం

ఆర్చరీ పోటీల్లో పిఠాపురం విద్యార్థుల ప్రతిభ

పిఠాపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఆర్చరీ పోటీల్లో పిఠాపురం విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. పట్టణంలోని భాష్యం స్కూలులో 8వ తరగతి చదువుతున్న సీహెచ్ లోహిత్, బి.జైదీప్ అండర్-14 విభాగంలో, జేఆర్ అరుణ్, ఆదిత్య అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు, కోచ్ పి.లక్ష్మణరావులను భాష్యం విద్యా సంస్థల జోనల్ ఇన్‌చార్జి వి.గోవిందరాజు అభినందించారు.


ప్రజా దర్బార్‌లో అర్జీదారులతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

ప్రజా దర్బార్‌కు 23 వినతులు

సామర్లకోట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట ఏడీబీ రోడ్డులోని కొప్పవరం వద్ద రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు కార్యాలయంలో శుక్రవారం 21వ ప్రజా దర్బార్ గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా వివిధ సమస్యలకు చెంది 23 అర్జీలు స్వీకరించినట్టు ఇన్‌చార్జి మేకా లక్ష్మణమూర్తి తెలిపారు. 5 సమస్యలను సత్వరం అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా పరిష్కరించినట్టు తెలిపారు. మిగిలిన 18 వినతులను ఆయా శాఖల అధికారులకు పరిష్కారం నిమిత్తం పంపారు. నులుకుర్తి వెంకటేశ్వరరావు, తలాటం హరీష్, చింతపల్లి అర్జున్, ముత్యాల అనిల్, పీఏ గౌరీశంకర్, బళ్ళ శ్రీనివాసు, జున్నూరు బాబ్జీ, ఆనంద్‌న్యూటన్ తదితరులు పాల్గొన్నారు.

'కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి'

పెద్దాపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా పోరాట యోధుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ పట్టణంలోని యాసలపు సూర్యారావు భవనంలో సిరిపురపు శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. తొలుత సీపీఎం సీనియర్ నాయకుడు చల్లా విశ్వనాథం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నీలపాల సూరిబాబు మాట్లాడుతూ ఏచూరి ఆశయాలను కొనసాగించడమే ఆయనకు మనమిచ్చే నివాళి అన్నారు. నాయకులు డి.సత్యనారాయణ, డి.కృష్ణ, కూనిరెడ్డి అప్పన్న, సిరిపురపు మరిడియ్య, యాసలపు రమేష్, కూనిరెడ్డి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'ఆక్రమణల్లో రిజర్వ్ ఫారెస్టు భూములు'

తాళ్లరేవు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న రిజర్వ్ ఫారెస్టు భూములు కబ్జాదారుల కనుసన్నల్లో ఆక్రమణలకు గురయ్యాయని, వాటిని రీసర్వే చేయించి నిర్ధారించాలని ఎంపీటీసీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్ కోరారు. శుక్రవారం ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో సత్యనారాయణ నిర్వహించారు. మడ అడవులను నరికేసి చెరువులు, కార్పొరేట్ సంస్థలు కంపెనీలు నిర్మించాయని ఆరోపించారు. రికార్డులకే తప్ప ఫారెస్టు భూములు భౌతికంగా ఆక్రమణదారుల చేతుల్లో ఉన్నాయన్నారు.

మల్లవుకోట లాకు వద్ద ఏర్పాటుచేసిన సాగునీరు పంపింగ్‌లో తీవ్ర అవినీతి చోటుచేసుకుంటుందని ఆరోపించారు. ఎంపీటీసీ, సర్పంచ్‌లు వారి పరిధిలో వున్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కాకినాడ జిల్లాకు సత్యలింగ నాయకర్ పేరు పెట్టాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. జడ్పీటీసీ దొమ్మేటి శామ్యూల్‌సాగర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'పీజీఆర్ఎస్‌లో డబ్బులు డిమాండు చేస్తున్నారు'

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌లో కొందరు వ్యక్తులు ఎస్సీ, బీసీ ఉద్యోగస్తులను టార్గెట్‌చేసి అసత్య ఆరోపణలు చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) కో-ఆర్డినేటర్ టి.చెంగలరావు ఆరోపించారు. శుక్రవారం ఆయన దళిత సంఘాల నాయకులతో కలిసి జిల్లా పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు. దళిత గిరిజన జిల్లా ప్రెసిడెంట్ అన్నవరం, మాలమహానాడు పిఠాపురం నియోజకవర్గ అధ్యక్షుడు మాతా సత్తిబాబు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కళోత్సవ్‌లో చేబ్రోలు విద్యార్థిని ప్రతిభ

గొల్లప్రోలు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో జరిగిన కళోత్సవ్ -2025 క్లాసికల్ డాన్స్ సోలో విభాగంలో చేబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని చల్లా హేమసత్య ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈమెకు అవార్డు, ప్రశంసాపత్రం అందజేశారు. హేమసత్యను గొల్లప్రోలు ఎంఈవో శివప్రసాద్, హెచ్ఎం సీహెచ్ ప్రకాష్, విద్యా కమిటీ చైర్మన్ చల్లా అంజనేయులు, వైస్ చైర్మన్ భక్తుల శ్రీను తదితరులు అభినందించారు.


ప్రథమ స్థానం పొందిన చల్లా హేమసత్యకు ప్రశంసాపత్రం, అవార్డు అందజేస్తున్న దృశ్యం

శిథిల రోడ్లు, వంతెనలు వెంటనే నిర్మించాలి


గొల్లపాలెంలో నినాదాలు చేస్తున్న కాజులూరు జేఏసీ నాయకులు

కాజులూరు (కరప), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాజులూరు మండలంలోని శిథిల రోడ్లు, వంతెనలను వెంటనే నిర్మించాలని డిమాండ్ చేస్తూ కాజులూరు జేఏసీ నాయకులు, ప్రజలు శుక్రవారం గొల్లపాలెంలో ఆందోళన చేపట్టారు. గొల్లపాలెం-కుయ్యేరు రోడ్డు గత పదేళ్లుగా పూర్తిగా పాడై శిథిలమైపోయినా యంత్రాంగం పట్టించుకోవట్లేదని ఆరోపించారు. కాజులూరు, చేదువాడల్లో వంతెనల నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని, మండలంలో శిథిలస్థితిలో ఉన్న లింకు రోడ్లను తక్షణం నిర్మించాలని నినదించారు.

అసంపూర్తిగా వదిలేసిన గొల్లపాలెం-కుయ్యేరు రోడ్డులో రాకపోకలు సాగించలేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డు నిర్మాణంపై గత జూలైలో ఏపీ కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో చేస్తే మంత్రి సుభాష్ స్పందించి ఆగస్టు 5 నుంచి రోడ్డు పనులు ముమ్మరంగా చేపడతామని హామీ ఇచ్చారని, అయితే నేటికీ ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందని విమర్శించారు. అధికార యంత్రాంగం తక్షణం స్పందించి రోడ్డు నిర్మాణం మొదలెట్టాలని, లేనిపక్షంలో ఈ నెల 17న కాజులూరు కృష్ణుడి గుడి వద్ద వంటా-వార్పు కార్యాక్రమంతో పాటు రాస్తారోకో చేపడతామని హెచ్చరించారు.

ఆందోళనలో అఖిలపక్ష నాయకులు మాధవరపు నానాజీ, మాజీ జడ్పీటీసీ యాళ్ల సూర్యప్రకాష్, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు, కడలి రాంపండు, సలాది నానాజీ, దంగేటి అరుణకుమార్, పైడికొండల వీరభద్రరావు, మాజీ ఎంపీటీసీ మాత నూకారావు, యాళ్ల నరసింహమూర్తి, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

జీతాల పెంపు కోసం శానిటేషన్ వర్కర్ల ఆందోళన

ఎమ్మెల్యే నానాజీ జోక్యంతో ఆందోళన విరమణ

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జీతాలు పెంచాలంటూ తిమ్మాపురం పంచాయతీ శానిటేషన్ వర్కర్లు శుక్రవారం పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. పెంచిన మేరకు జీతాలు చెల్లించాలని, లేదంటే విధులు బహిష్కరించి ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని శానిటేషన్ వర్కర్లు స్పష్టం చేశారు. దాంతో ఇన్‌చార్జి కార్యదర్శి రామ్మోహన్‌చౌదరి ఈ విషయాన్ని ఎంపీడీవో పేపకాయల సతీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన తిమ్మాపురం విచ్చేసి సిబ్బందితో చర్చించారు. జీతాల పెంపుపై ఉన్నతాధికారులతో మాట్లాడతానని... ఆందోళన విరమించాలని కోరారు. సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్దిష్టమైన హామీ ఇస్తేనే నిరసన విరమిస్తామని కార్మికులు స్పష్టం చేశారు. దాంతో ఈ విషయాన్ని ఎమ్మెల్యే పంతం నానాజీ దృష్టికి తీసుకెళ్లగా.... ఆయన జిల్లా పంచాయతీ అధికారితో మాట్లాడి టెండర్ల ప్రకారం తీర్మానం చేసిన మేరకు రూ.16 వేలు చొప్పున జీతాల పెంపు అమలు చేయాలని డీపీవోను ఆదేశించారు. ఎమ్మెల్యే నానాజీ డీపీవోతో మాట్లాడిన విషయాన్ని కార్మికులకు ఎంపీడీవో సతీష్ చెప్పడంతో ఆందోళన విరమించారు. సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, ఈవోపీర్డీ ఎంఎస్ఆర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


తిమ్మాపురం పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న శానిటేషన్ వర్కర్లు

14, 15 తేదీల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల పోటీలు

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని దేవాలయం వీధిలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో వివిధ పోటీలు నిర్వహించనున్నట్టు ఈవో రాజేశ్వరరావు, చైర్మన్ వెత్సా మురళి, పోటీల కన్వీనర్ వంకాయల కృష్ణ తెలియజేశారు. 14వ తేదీ సాయంత్రం 5 గంటలకు 5,6,7 తరగతుల వారికి శ్రీకృష్ణ చిత్రలేఖన పోటీలు, 6 గంటలకు ఎల్‌కేజీ నుంచి 10 తరగతి విద్యార్థులకు జూనియర్, సీనియర్ విభాగాల్లో భగవద్గీత శ్లోకాల పోటీ జరుగుతాయి. 15వ తేదీ సాయంత్రం 5 గంటలకు శ్రీకృష్ణ విచిత్ర వేషధారణ పోటీలు, కృష్ణుడికి సంబంధించిన క్విజ్ పోటీలు నిర్వహిస్తారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేస్తారు. ఆసక్తి గల వారు మరిన్ని వివరాలకు 9866694041 నెంబరును సంప్రదించాలన్నారు.

పిఠాపురం మహా సంస్థానంలో ప్రత్యేక పూజలు

పిఠాపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీపాదశ్రీవల్లభుల వారి పాదపద్మాలకు మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, గోపూజ, దత్త హోమం, పల్లకీ సేవ నిర్వహించారు. పూజల అనంతరం శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులను పుష్పాలతో అలంకరించారు. ఆలయ ఈవో సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చంద్రసేన గుప్త జయంతి

కొత్తపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉప్పాడ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో శుక్ర వారం కల్వకుంట్ల చంద్రసేనగుప్త జయంతి వేడుకలు నిర్వహించారు. ఉప్పాడ నెం.1 ప్రాథమిక పాఠశాలలో వికలాంగ విద్యార్థులకు టవల్స్, పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ముగ్గురు సీనియర్ జర్నలిస్టులకు దుశ్శాలువాలు కప్పి జ్ఞాపికలతో సత్కరించారు. కొత్తపల్లి మండల వాసవీ క్లబ్ అధ్యక్షుడు దంగేటి దత్తాత్రేయ, కార్యదర్శి చెన్న విఠల్‌బాబు, కోశాధికారి కూరగాయల వెంకటరాజు, ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు కూరగాయల రఘు, పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు రాట ముహూర్తం

పెదపూడి (కరప), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెదపూడి మండలం కరకుదురు దుర్గాదేవి ఆలయం వద్ద దేవి శరన్నవరాత్రులను పురస్కరించుకుని ఆలయ కమిటీ చైర్మన్ తోటకూర శ్రీను నేతృత్వంలో గ్రామ పెద్దల సమక్షంలో శుక్రవారం పందిరి రాట ముహూర్తం చేశారు.



ఆలయ కమిటీ సభ్యులు అడబాల బుజ్జి, పెద్దిరెడ్డి సాయిబాబు, సానా రాజు, కంచుమర్తి రాంబాబు, అడపా శ్రీను, పులి కేశవప్రసాద్, అల్లం బుజ్జి, మద్దూరి ఆదినారాయణ, పెమ్మనబోయిన వీరబాబు, పేపకాయల మునలయ్య, అడపా రాము తదితరులు పాల్గొన్నారు.

దేవుడి భూమి స్వాధీనం

కాజులూరు (కరప), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాజులూరు మండలం ఆర్యవటంలో ఆక్రమణల చెరలో ఉన్న దేవుడి భూమిని కోర్టు ఆదేశాల మేరకు అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని సీతారామస్వామి దేవస్థానానికి అర్చక సర్వీస్ నిమిత్తం సర్వే నెం.115/1లో 4.06 ఎకరాల భూమి ఉంది. దేవస్థానం వంశపారంపర్య అర్చకులు ఈ భూమిని 1999లో ఆరుగురు వ్యక్తులకు విక్రయించగా దేవదాయ శాఖాధికారులు అప్పట్లో జిల్లా కోర్టును ఆశ్రయించారు. 2006లో కోర్టు దేవస్థానానికి అనుకూలంగా తీర్పు ఇవ్వగా దాన్ని సవాల్ చేస్తూ కొనుగోలుదారులు హైకోర్టును ఆశ్రయించారు. దేవుడి భూమిని స్వాధీనం చేసుకోవాలని ఈ ఏడాది మార్చిలో హైకోర్టు కూడా దేవస్థానానికి అనుకూలంగా తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం దేవాదాయ ధర్మాదాయ, గొల్లపాలెం పోలీసులు, రెవెన్యూ అధికారులు, ప్రజల సమక్షంలో 4.06 ఎకరాల్లో ఉన్న చేపల చెరువులను ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకుని సీతారామస్వామి దేవస్థానం ఈవోకు అప్పగించారు. జిల్లా దేవదాయ శాఖాధికారి కె.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ వి.ఫణీంద్రకుమార్, ఈవోలు మోర్తా మురళీవీరభద్రరావు, కె.రవితేజ, జి.శివబాబు, వేణుగోపాల్, డి.శ్రీనివాసరావు, కె.సోమరాజు, ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆ పనులపై ఉన్న సందేహాలను నివృత్తి చేయండి'

కాకినాడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరానికి చేరువలో ఉన్న కోరమాండల్ కర్మాగారంలో జరుగుతున్న ప్లాంట్-3 నిర్మాణ పనులపై ప్రజలకు ఉన్న సందేహాలను నివృత్తి చేయాలని కోరుతూ కాకినాడ జిల్లా బీజేపీ నేతలు తుమ్మలపల్లి నారాయణరావు, కాళ్ల ధనరాజు, పుట్టా వీరప్రసాద్ తదితరులు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి బోర్డు డైరెక్టర్ (ఉత్తరాంధ్ర రీజియన్) పంచకర్ల సందీప్‌ను కోరారు. విజయవాడ ఆటోనగర్‌లో ఉన్న రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి బోర్డు కార్యాలయానికి వెళ్లి ఆయన్ను స్వయంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కోరమాండల్‌లో రెండు ప్లాంట్లు ఉన్నాయని, కొన్ని రోజులుగా మూడో ప్లాంట్ నిర్మాణం జరుగుతోందని వివరించారు. తొలుత నిర్మించిన ప్లాంట్‌కు సంబంధించి ఉన్న గ్రీన్‌బెల్ట్‌నే మిగిలిన రెండు ప్లాంట్లకు చూపుతున్నారనే సందేహాలు, అనుమానాలు ప్రజలకు వ్యక్తమవుతున్నాయని, వాటిని వెంటనే పరిశీలించి, ప్రజలకు వివరించాలని కోరారు. ఒక్కో ప్లాంట్‌నుంచి వెలువడే వాయు కాలుష్య శాతం ఎంతెంత? అనే విషయాలను తెలుసుకుని, స్మార్ట్ సిటీవాసులు కాలుష్యం బారినపడకుండా చూడాలని వినతిపత్రంలో కోరారు.

బీసీలకు ఇచ్చిన ప్రధాన హామీల డిమాండ్లు నెరవేర్చాలి

కాకినాడ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బీసీలకు గతంలోని రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన ప్రధానమైన ఐదు హామీలను నెరవేర్చాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుత్తుల రమణ ఆధ్వర్యంలో బీసీ నాయకులు శుక్రవారం కలెక్టరేట్‌లో పరిపాలనాధికారి రామ్మోనరావుకు వినతిపత్రం అందజేశారు. కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటుచేసి సబ్ ప్లాన్ ద్వారా ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించాలన్నారు. రాజధానిలో మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే స్మృతివనం ఏర్పాటుచేసి బీసీల ఆత్మగౌరవాన్ని పెంచాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం నాయకులు బడే కృష్ణ, మన్నే నాగేశ్వరరావు, పెండ్యాల ఏసుబాబు, మల్లిపూడి శివాజీ, డీవీవీ కుమారస్వామి, వకా మాలతి, ఎం.మెనా, వి.దుర్గా మంగతాయారు, బత్తుల భవాని, దళిత సంఘం రాష్ట్ర నాయకుడు బచ్చల కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ పాఠశాలను సందర్శించిన కలెక్టర్

సామర్లకోట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట-పెద్దాపురం రోడ్డులో ఉన్న సిరి మానసిక వికలాంగ పాఠశాల నిర్వహణ తీరును స్వయంగా తెలుసుకునేందుకు కలెక్టర్ షాన్‌మోహన్ శుక్రవారం మధ్యాహ్నం విచ్చేశారు. నిర్వాహకురాలు డీ.గోపీదేవి తాము దివ్యాంగ విద్యార్థులకు అందిస్తున్న వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్థికాభివృద్ధికి మహిళలతో నిర్వహిస్తున్న పేపర్‌ప్లేట్స్ యూనిట్, క్లాత్ మేకింగ్ యూనిట్లను నిర్వాహకురాలు ద్వారా కలెక్టర్ తెలుసుకుని వాటి నిర్వహణాతీరును తెలుసు కునేందుకు సమాచారాన్ని రాబట్టారు. దివ్యాంగ పాఠశాలలో భద్రతా పరిస్థితులపైనా కలెక్టర్ స్వయంగా పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దారు కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, వీఆర్వో నూతలపాటి లోవరాజు వున్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన



కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా చైల్డ్‌రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్లోబల్ ఇంటర్ ఫెయిత్ ప్లెడ్జ్ వీకెండ్ టు ఎండ్ చైల్డ్ మార్యేజ్ కార్యక్రమాన్ని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ప్రతినిధి జె.విజయ, కో-ఆర్డినేటర్ బి.కుమారి ఆధ్వర్యంలో శుక్రవారం ఆలయాలు, చర్చిలు, మసీదుల్లో అవగాహన కల్పించారు. రామారావుపేట శివాలయంలో ముఖ్య అర్చకుడు మాగంటి నాగ సుందర మోహన్ శర్మ, చర్చి ఫాదర్ నెహెమ్యా, ఇతర సిబ్బంది బాల్య వివాహాలు చట్టవిరుద్ధమైన సమాజానికి హానికరమని, పిల్లలను ప్రేమ, సంరక్షణతో పెంచుకోవాలని హితవు పలికారు.

జైగణేష్ దేవస్థానంలో హుండీల లెక్కింపు

పిఠాపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జైగణేష్ దేవస్థానంలో హుండీలను తెరిచి లెక్కించారు. ఏడాదికి రూ.2,55,931 ఆదాయం లభించింది. దేవదాయ శాఖ తనిఖీదారు వడ్డి ఫణీంద్రకుమార్, ఈవో నున్న శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



వ్యాధి నిరోధక టీకాలపై గోడ పత్రికల ఆవిష్కరణ

జీజీహెచ్ (కాకినాడ), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) మీజిల్స్, రుబెల్లా వ్యాధి నిరోధక టీకాలకు సంబంధించిన గోడ పత్రికలను డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహ నాయక్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కేవీ సుబ్బరాజుతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎల్‌వో డాక్టర్ ఐ.ప్రభాకర్, డాక్టర్ జి.లక్ష్మి, డాక్టర్ అరుణ, డాక్టర్ విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరిచెట్ల నరికివేతపై విచారణ

తాళ్లరేవు, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ఉప్పంగలలోని శ్రీరామలింగేశ్వర ఆలయంలో కొబ్బరిచెట్ల నరికివేత ఫిర్యాదుపై దేవదాయ శాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు శుక్రవారం విచారణ చేపట్టారు. ఫిర్యాది వంగా త్రిమూర్తులు, కొబ్బరిచెట్లు నరికిన వ్యక్తి దవులూరి శ్రీరామచంద్రమూర్తి, గ్రామస్తుల సమక్షంలో దేవాలయంలో విచారణ చేపట్టారు. జిల్లా అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ ద్వారా ఇద్దరి అభిప్రాయాలను స్వీకరించామన్నారు. నివేదికను కలెక్టర్‌కు అందివ్వనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ శాఖా శంఖరుడు, ఈవో సోమరాజు, ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.



లోకేశ్ చిత్రపటానికి పాలాభిషేకం

కాకినాడ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నేపాల్ అల్లర్లలో చిక్కుకున్న ఆంధ్రులను క్షేమంగా తీసుకు రావడంలో మంత్రి నారా లోకేశ్ చూపిన చొరవ ప్రశంసనీయమని నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు అన్నారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో ఫౌండేషన్ కార్యాలయం వద్ద లోకేశ్ చిత్రపటానికి పూలాభిషేకం, పాలాభిషేకం చేశారు. అన్న ఎన్టీఆర్ జనార్దన్ క్యారేజ్ ద్వారా పేదలకు భోజన వితరణ చేశారు. ఫౌండేషన్ సభ్యులు బత్తుల సూర్యప్రసాద్, కర్రి వీరబాబు, మండపాక వీరవెంకట సత్యనారాయణ, మండపాక నాగబాబు, విజయలక్ష్మి, నందిని, విజయలక్ష్మి, మానస, రాణి తదితరులు పాల్గొన్నారు.

కాటన్ సంచుల పంపిణీ

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం, భావితరాలకు కాలుష్యరహిత సమాజం కోసం ప్లాస్టిక్‌కు బదులు కాటన్ సంచులు వాడాలని అడబాల ట్రస్టు అధ్యక్షుడు రత్నప్రసాదరావు, రిటైర్డు ఉపాధ్యాయుడు నిమ్మకాయల వెంకటేశ్వరరావు కోరారు. శుక్రవారం ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్టు ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల శూన్య దినోత్సవం సందర్భంగా వృద్ధులకు కాటన్ సంచులు పంపిణీ చేశారు. ప్లాస్టిక్ ఉత్పత్తులు వాడడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. రవిశంకర పట్నాయక్, సత్యనారాయణచౌదరి తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలపై అవగాహన సదస్సు

రౌతులపూడి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రౌతులపూడి రైతు సేవా కేంద్రంలో చిరు ధాన్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాయలం పెద్దాపురం ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎ.సీతారామ శర్మ, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఐ.సుధీర్ కుమార్ చిరుధా న్యాలు రాగులు, జొన్న సజ్జ, అరికలు, సామలు పంటల వల్ల కలిగే ప్రయోజ నాలను రైతులకు వివరించారు. వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

లోయర్ సీలేరు జేఏసీ సమావేశం

● దీర్ఘకాలిక సమస్యలపై ఆందోళనలో పాల్గొనాలని ఏకగ్రీవ తీర్మానం



జెన్‌కో అధికారికి వినతిపత్రాన్ని అందజేసిన దృశ్యం

మోతుగూడెం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): లోయర్ సీలేరు జేఏసీ విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల నేతలు గురువారం సాయంత్రం సమావేశమయ్యారు. రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 15 నుంచి 22 వరకు జరిగే ఆందోళన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఇందులో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా లోయర్ సీలేరు జేఏసీ నాయకులు దశలవారీ ఆందోళన కార్యక్రమాల వినతిపత్రాన్ని లోయర్ సీలేరు కాంప్లెక్స్ ముఖ్య ఇంజనీర్ డీ. చిన్న కామేశ్వరరావుకు అందజేశారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు బాలకృష్ణ, నాగశ్రీనివాస్, జేఏసీ ఛైర్మన్, కన్వీనర్ కిరణ్, ఆనందబాబు కో ఛైర్మన్ రామారావు, పవన్, రమణ, సురేష్, కొట్టు శ్రీనివాస్, మల్లిఖార్జున్, శర్మ, తదితరులు హాజరయ్యారు.

రేఖపల్లిలో నిత్యావసర సరుకుల పంపిణీ

వీఆర్‌పురం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రేఖపల్లి పంచాయతీలోని రేఖపల్లిలో గల వరద బాధిత కుటుంబాలకు శుక్రవారం నిత్యావసర సరుకులను జడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి, సర్పంచ్ పూనెం సరోజిని పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి కందిపప్పు, నూనె, ఉల్లిపాయలు, బంగాళా దుంపలు అందజేశారు. ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్, టీడీపీ నేతలు బీరక సూర్యప్రకాష్‌రావు, బురక కన్నారావు, సీపీఎం నేత శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ఆలయ ఛైర్మన్‌గా శ్రీనివాస్ రెడ్డి ప్రమాణ స్వీకారం

దేవీపట్నం, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): గండిపోశమ్మ తల్లి ఆలయ ఛైర్మన్‌గా ఎం.శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. దీనికి రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి హాజరయ్యారు. అలాగే కె.సత్యనారాయణ, పి.వెంకన్న, ఎస్.వెంకటేశ్వరరావు, ఎం.సుబ్రహ్మణ్యం, కె. వెనకట సత్యరామ, యాన్ జేబీ, పి.భాగ్యలక్ష్మి, పి.పెద్ద సత్యనారాయణ, కె.కల్యాణి, గుడి ఆసామి యస్.బాబు, దొర ట్రస్ట్ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. నియోజకవర్గ అబ్జర్వర్ కొల్లిబోయిన శ్రీనివాస్ యాదవ్, ఎస్టీ కమిషన్ మెంబర్ గొర్లె సునీత, రంపచోడవరం మండల అధ్యక్షుడు మోహన్, దేవీపట్నం మండలం కన్వీనర్ మారిశెట్ల వెంకటేశ్వరావు, గోళ్ల చంటిబాబు, దేవీపట్నం ఇందుకూరుపేట సొసైటీ అధ్యక్షులు బాబూరావు, కొండారెడ్డి, మధు, గంగాధర్ దేవీపట్నం సర్పంచ్ రాజమణి, పాముగండి సర్పంచ్ శివారెడ్డి, అచ్చిబాబు, పండా బాబీ, చావలం బాపిరాజు, చక్రవర్తి, అరుణ, సింగరాజు, బాపిరాజు పాల్గొన్నారు.

ఆదివాసీ సంక్షేమ పరిషత్ బృందం పర్యటన

దేవీపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ బృందం శుక్రవారం పర్యటించింది. దీనిలో భాగంగా ఇందుకూరులో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను మాట్లాడుతూ మండలంలో నాన్ ట్రైబల్స్‌కు, అవినీతి అధికారులకు పోలవరం ప్రాజెక్టు వరంగా, ఆదివాసులకు శాపంగా మారిందన్నారు. అసలైన స్థానిక ఆదివాసీ నిర్వాసితులకు ల్యాండ్ టు ల్యాండ్ కోసం లేదా కనీసం పరిష్కారమైన చెల్లించాలని దాదాపు పది సంవత్సరాల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతూ అలసిపోయారన్నారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తీగల బాబూరావు, డివిజన్ కోఆర్డినేటర్ పితా ప్రసాద్, నాయకులు యాలగడ్డ నాగేశ్వరరావు, నిర్వాసితులు ముర్ల నాగమణి, పెద్దిరెడ్డి, జీడి పోచివేని, కోసు సోమన్న ధర, తాటి రామన్న దొర, సూరన్న దొర, వీరభద్ర రెడ్డి, కొమరం లచ్చన్న దొర, తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాను సద్వినియోగం చేసుకోండి

చింతూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులు నానో యూరియాను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా చింతూరు వ్యవసాయ అధికారిణి రత్నప్రభ పేర్కొన్నారు. శుక్రవారం కల్లేరు రైతు సేవా కేంద్రంలో రత్నప్రభ నేతృత్వంలో యూరియా పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ నానో యూరియా ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో కల్లేరు సర్పంచ్ సంకురమ్మ, సీఐ గోపాలకృష్ణ, ఏఎస్ఐ మల్లిఖార్జునరావు, వార్డు సభ్యురాలు కమలమ్మ, పీసా కార్యదర్శి మనోజ్, పొడియం జానీ, వ్యవసాయ సహాయకుడు సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

చింతూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గించిన నేపథ్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి శుక్రవారం చింతూరులో బీజేపీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జీజేపీ జిల్లా మాజీ కార్యదర్శి పాయం వెంకయ్య మాట్లాడారు. సీఎస్టీ తగ్గిండంతో బీజేపీ పేద ప్రజలకు మరింత చేరువైందన్నారు. కార్యక్రమంలో మాజీ మండల శాఖ అధ్యక్షుడు డీవీఎస్ రమణారెడ్డి, బాలాజీ, శ్రీను, మానే వీరబాబు, లక్ష్మి, విశ్వనాథ్, మాని జయ, టీడీపీ నాయకుడు పొదిలి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు సన్మానం

మారేడుమిల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పదోన్నతి పొంది బదిలీపై వెళ్లిన అధికారులను మండల ప్రజాప్రతినిధులు, అధికారులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. మారేడుమిల్లి ఎంపీడీవోగా పనిచేసిన తూతిగ శ్రీనివాస్ విశ్వనాథ్ డ్వామా ఏపీడీగా పదోన్నతి పొంది బదిలీపై వెళుతున్న సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ, సచివాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. అలాగే ఎంపీడీవో కార్యాలయంలో సబార్డినేట్‌గా పనిచేస్తున్న భాస్కర్ యల్లవరం జడ్పీ హైస్కూల్‌లో రికార్డు అసిస్టెంట్‌గా పదోన్నతిపై వెళుతున్న సందర్భంగా ఆయన్ని కూడా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ సార్ల లలిత కుమారి, సర్పంచ్ కొండ జాకబ్, ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం. రత్నకుమారి, కార్యదర్శులు శ్రీనివాస్, దివ్య, సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

యూరియా కోసం వెతలు

ఎటపాక, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అయితే శుక్రవారం అందుబాటులోకి రావడంతో మండలంలోని వివిధప్రాంతాల్లోని రైతులు రైతుసేవా కేంద్రం వద్ద బారులు తీరారు. చోడవ రంలోని రైతు సేవా కేంద్రానికి 14 టన్నులు వచ్చింది. దీంతో చోడవరం, నెల్లిపాక, దేవరపల్లి, రాయనపేట, గుండాల, వెంకటరెడ్డిపేట, తదితర గ్రామాల నుంచి రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మొత్తం 254 మంది రైతులకు 310 బస్తాలను పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు ఒక్కో బస్తా అందజేశారు. మరికొందరికి రెండేసి చొప్పున ఇచ్చారు. రెండు రోజుల్లో టీపీ వీడు రైతు సేవా కేంద్రంలో ఆరు టన్నుల యూరియా పంపిణీ చేయనున్నట్టు ఏవో రమేష్ తెలిపారు. పంపిణీ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మాచినేని రాజేష్, పుట్టి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో అన్నసమారాధన

వై.రామవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్ సెంటర్‌లోని రామాలయం వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వినాయక నవరాత్రులను పురస్కరించుకుని మహిళా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో మడకం రామలక్ష్మి, ఇందిర, విజయ లలిత కుమారి, లక్ష్మి, రెడ్డి లక్ష్మి, శేష కుమారి, తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం

అడ్డతీగల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాయపల్లిలో అల్లూరి జిల్లా కేడీపేటకు చెందిన ట్రైబల్ హెల్త్ అండ్ వెల్ఫేర్ సంస్థ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని స్థానిక సర్పంచ్ చెదల విశ్వనాథం చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ అధినేత వీ.పూర్ణచంద్ర మాట్లాడుతూ శిక్షణ కేంద్రంలో మహిళలకు 15 రోజుల పాటు ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

అందరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు

● జగ్గంపేట ఎమ్మెల్యే నెహ్రూ



టీడీపీలో చేరిన వారికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక రావులమ్మనగర్‌లోని టీడీపీ పార్టీ కార్యాలయంలో జగ్గంపేట సంజీవి ఫిషర్‌మాన్ కోఆపరేటివ్ సొసైటీ సంఘం సభ్యులు కడితిలాజర్ ఆధ్వర్యంలో సుమారు 26 కుటుంబాలు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి నెహ్రూ పార్టీ కండువాలువేసి సాధారంగా స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ సుపరిపాలనకు ఆకర్షితులై సొసైటీ సభ్యులందరూ టీడీపీలో చేరినందుకు స్వాగతం పలుకుతున్నామన్నారు. అందరికీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించడానికి తాను సిద్ధమన్నారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ అప్పలరాజు, కొత్త కొండబాబు, బుర్రి సత్తిబాబు, పాండ్రంగి రాంబాబు, దేవరపల్లి మూర్తి, పీలామహేష్, రాయిసాయి, మారిశెట్టి రాధా, వేములకొండ జోగారావు, సాంబత్తుల చంద్రశేఖర్, తుమ్మల కిషోర్, గెడ్డాడ సత్యవేణి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నెహ్రూను కలిసిన తాతారావు

జగ్గంపేట డివిజన్ ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ బిల్లింగ్ సీనియర్ క్లర్క్. గా నూతనంగా బాధ్యతలు స్వీక రిం చిన తుమ్మల తాతారావు స్థానిక రావులమ్మ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాం ప్ ఆఫీస్‌లో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ సెక్రెటరీ తుమ్మల కిషోర్, పడాల ఆంజనేయులు, కేశవప్రసాద్, గంట్లని రమేష్, కె.సురేష్, ఎం.మాధవ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎంపీడీవో

గండేపల్లి ఎంపీడీవోగా నూతనంగా వచ్చిన కర్రీ హరికృష్ణ సత్యారెడ్డి జగ్గంపేట ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను మర్యాద పూర్వకంగా కలిశారు.

సమస్యలు పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగుల వినతి



వినతిపత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

తొండంగి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మండల సచివాలయ ఉద్యోగులు తొండంగి ఈవోపీ ఆర్డీ ప్రేమకుమార్‌కు వినతి పత్రం అందించారు. తరచూ తమ ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా ఇంటింటికి తిప్పడం, సర్వేలు నిర్వహించాల్సి రావడం తదితర పనులకారణంగా తాము ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. అదనపు పనిఒత్తిడిని తగ్గించాలన్నారు. తమ సమస్యలు నిర్ణీత గడువులోపు పరిష్కారం కాకపోతే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామన్నారు. కార్యక్రమంలో అంగులూరి కృష్ణ ప్రకాష్, మేకా బ్రహ్మానంద గౌడ్, సుర్ల విజయ కుమార్, వీరబాబు, అశోక్ పాల్గొన్నారు.

గిరిజనుల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యం

● ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

శంఖవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి వారి జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యం గా కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. శుక్రవారం పెదమల్లాపురం నుంచి కాకినాడకు ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. ఇటీవలే రహదారులు మెరుగుపరిచామని, దశాబ్దకాలంగా గిరిజన ప్రజలు పడుతున్న అవస్థలను దృష్టిలో ఉంచుకుని బస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్ ఈ బస్సును దివంగత నేత వరుపుల రాజాకు అంకితం చేద్దామన్నారు. పెదమల్లాపురం గిరిజన మండలంగా ఏర్పాటు చేయాలని స్థానికులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బద్ది రామారావు, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు బచ్చల గంగ, ఈగల దేవుళ్ళు, బద్ది రమణ, కీర్తి సుభాష్, పోలం చిన్నా, జనసేన నేతలు కరణం సుబ్రహ్మణ్యం, గాబు సుభాష్, తలపంటి బుజ్జి, ఆర్టీసీ ఆర్ఎం ఎం.శ్రీనివాసరావు, డిపో మేనేజరు జీవి రమణ పాల్గొన్నారు.



పెదమల్లాపురంలో బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఉచిత బస్సు పాస్‌లు ఇవ్వాలని జగ్గంపేటలో విద్యార్థుల నిరసన



జగ్గంపేట సర్వీస్ రోడ్డులో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

జగ్గంపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జగ్గంపేట సర్వీసు రోడ్‌లో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యు విజృంభణ) ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి కె.సతీష్ మాట్లాడుతూ తక్షణం కొత్త బస్సులు ఏర్పాటుచేసి విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాయి, నారాయణ, గంగాధర్, స్వామి, అభిషేక్, తేజ ప్రసాద్, కనకరాజు, సాయి, బాపిరాజు, దొర పాల్గొన్నారు.

ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సత్కారం



ఏలేశ్వరంలో ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఏలేశ్వరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను అలమండ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు శుక్రవారం సత్కరించారు. స్థానికప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిమ్మకాయల లక్ష్మీ తులసి, ఏలేరు ప్రాజెక్టు ఏరియా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కొవ్వాడ వీర్రాజులను ఆ పాఠశాల ఆవరణలో ట్రస్ట్ అధ్యక్షుడు అలమండ దుర్గా వెంకటప్రసాద్, తూరౌతు గురవయ్య శాలువాకప్పి మెమెంటో అందజేసి సత్కరించారు. ఉపాధ్యాయులు బాలరాజు, శ్రీరామ్, చిన్న, లోవప్రసాద్, సూరన్నదొర, గంగరాజు, చినబాబు పాల్గొన్నారు.

'ఆదిత్య' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

గండేపల్లి, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ ఇంజనీరింగ్ విద్యార్థుల 4 బృందాలు అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ 2025 సెమీ ఫైనల్స్‌కు అర్హత సాధించారని డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ 4 బృందాల నుంచి 3 బృందాలు ఫైనల్స్‌కు ఎంపికై ఈనెల చివరిలో అమరావతిలో జరుగనున్న ఏపీ క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ ఫైనల్స్‌లో పాల్గొనున్నారు. విజేతలను శ్రీనివాస్ రెడ్డి, వైస్ చాన్సలర్ ఎమ్. శ్రీనివాస్ అభినందించారు.

తుమ్మలపల్లి రమేష్ పరామర్శ

జగ్గంపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి మండలం రామచం ద్రపురానికి చెందిన బండారు జగన్నాధరావు ఇటీవల కంటి ఆపరేషన్ చేయించు కోవడంతో శుక్రవారం జనసేన పార్టీ జగ్గంపేట ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ పరామర్శించారు. ఆయన వెంట పాఠంశెట్టి రమేష్, రేపూరి శ్రీను, పబ్బిరెడ్డి మణికంఠ, కోలమూరు బుజ్జి తదితరులు ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



జగ్గంపేట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గండేపల్లి, జగ్గంపేట పీఎస్‌ల పరిధిలో పేకాడుతున్న 34మందిని పోలీసులు అరెస్టు చేశారు. పెద్దాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. వారికి రూ.300చొప్పున జరిమానా విధించారు. జగ్గంపేట గోపాల్‌నగర్‌కు చెందిన మరిడియ్యను 26బాటిల్స్‌తో అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచారు. అతడికి రూ.10,500 జరిమానా విధించినట్టు సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు.

ఎక్కడ చూసినా చెత్త కుప్పలే?



కొత్తపల్లి సచివాలయం పక్కనే చెత్తకుప్ప

శంఖవరం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొన్ని గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు పెరిగిపోయాయని ఆ ప్రాంతవాసులు ఆరోపిస్తున్నారు. వాటి వల్ల ఈగలు, దోమలు పెరిగిపోయి తరచూ అనారోగ్యంబారిన పడుతున్నామని స్థానికులు ధ్వజమెత్తుతున్నారు. పరిసరాల శుభ్రత విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతగా ప్రచారం చేస్తున్నా కొందరి నిర్లక్ష్యం కారణంగా తరచూ ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోందని పలువురు స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. మండలంలోని కొత్తపల్లి, పెదమల్లాపురం, వేళంగి గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నట్లు వారు ఆరోపిస్తున్నారు. ఆయా గిరిజన గ్రామాల్లో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది కార్యాలయాలకు హాజరుకావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ యంత్రాంగం స్పందించి అపారిశుద్యంపై దృష్టిసారించాలన్నారు.

'బాల్య వివాహాలు నిర్మూలించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

గండేపల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు నిర్మూలించాలని జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సంస్థ.. జగ్గంపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి ఎమ్.పూర్ణిమ అన్నారు. ఆమె అధ్యక్షతన గండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ స్థాయి బాలల సంక్షేమ, పరిరక్షణ కమిటీ అధికారులకు బాలల చట్టాలపై శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీడీవో కర్రి హరికృష్ణ సత్యరెడ్డి మాట్లాడుతూ బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన బాధ్యత గ్రామస్థాయి కమిటీ అధికారులందరికీ ఉందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్.వెంకటరావు, చెల్డ్ హెల్ప్‌లైన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగ పార్వతి సునీత తదితరులు పాల్గొన్నారు.

అన్నదానాలతో గ్రామాల్లో ఐక్యత: ఎమ్మెల్యే



అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అన్నదానాలతో గ్రామాల్లో ఐకమత్యం నెలకొటుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చెప్పారు. లంపకలోవలో శుక్రవారం టీడీపీ నాయకుడు గొంతిన సురేష్ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలు ముగింపు సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాయినార్లకు భవానీల పూజలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి అడ్డురోడ్డు వద్ద గల అరుణాచలేశ్వర ఆలయంలో శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన నాయినార్ల విగ్రహాలకు భవానీ భక్తులు పూజలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా మాలధారణ చేసిన భక్తులు నాయినార్ల విగ్రహాలకు అభిషేకాలు,విశిష్ట పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపకులు రమణానంద స్వామి, పాల్గొన్నారు.





ఎమ్మెల్యే జ్యోతుల దంపతులను సత్కరిస్తున్న మోహనరావు దంపతులు

ఎమ్మెల్యే దంపతులకు సత్కారం

జగ్గంపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్వగృహంలో నెహ్రూ, మణి దంపతులను రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు శాంతి దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. మోహన్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన నెహ్రూ ఆధ్వర్యంలో పనిచేస్తూ ప్రభుత్వపరంగా అన్ని వర్గాలను ఆదుకుంటామన్నారు.

గ్రామాల్లో సంపూర్ణ స్వచ్ఛతే లక్ష్యం



గౌరంపేటలో గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎల్‌పీవో బాలామణి

శంఖవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సంపూర్ణ స్వచ్ఛతే లక్ష్యంగా పనిచేయాలని డీఎల్‌పీవో బాలామణి తెలిపారు. శుక్రవారం గొంది కొత్తపల్లిలో పారిశుధ్యాన్ని పరిశీలించారు. ప్రతీ ఇంటి నుంచి తప్పనిసరిగా చెత్తను సేకరించాలని ఆదేశించారు. గ్రామాల్లో ఎక్కడా చెత్తకుప్పలు కనపడకుండా ఉండాలని, దీని కోసం గ్రామస్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆమె వెంట డిప్యూటీ ఎంపీడీవో రామలక్ష్మి, పంచాయితీ కార్యదర్శి మణి ఉన్నారు.

19 అంశాల ఏకగ్రీవ ఆమోదం

● తునిలో కౌన్సిల్ సమావేశం

తునిరూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తుని మున్సిపాలిటీలో ఛైర్మన్ భువన సుందరి అధ్యక్షతన శుక్రవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. 19 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా దోబీఘాట్ వద్ద చేసిన ఏర్పాట్లకు సంబంధించి ఎజెండాలో పొందుపరిచిన ఖర్చు అంశంపై 24వ వార్డు కౌన్సిలర్ పులి సత్యనారాయణ అధికారులను నిలదీశారు. తుని, పాయకరావుపేటకు సంబంధించి తునిలో నిమజ్జన ఏర్పాట్లు ఎలా చేస్తారని ప్రశ్నించారు. భవిష్యత్తులో ఇలాంటివి లేకుండా చూడాలన్నారు. ఈఅంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని అధికారులు తెలిపారు. సమావేశంలో కమిషనర్ వెంకట్రావు, వైస్ ఛైర్మన్లు కుచ్చర్లపాటి రూపాదేవి, ఆచంట సురేష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బొత్సను కలిసిన గిరిబాబు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి):ఉభయ గోదావరి జిల్లాల వైసీపీ రీజనల్ కో ఆర్డినేటర్, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణను ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు కలిశారు. శుక్ర వారం గిరిబాబు విజయవాడ వెళ్లి బొత్సతో భేటీ అయ్యారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపై చర్చించారు.